# క్రైమ్ మిర్రర్

THE

Voice of Anti Corruption

హైదరాబాద్
9-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 199

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


గులాబీ పార్టీకి ఊపిరి ఆడడం లేదు. ముఖ్యంగా కేసీఆర్ ఫామ్ హౌస్ చుట్టూ తిరుగుతున్న వివాదం నిద్ర పట్టనివ్వడం లేదు. తెలంగాణ రాజకీయాల్లో ఏదో రసవత్తర మలుపు. కెసిఆర్ ఫామ్ హౌస్ కేంద్రంగా ప్రభుత్వం చేస్తున్న ఎత్తుగడలు గులాబీ శిబిరంలో కలకలం రేపుతున్నాయి. రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 325లో మొత్తం 38 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉండాలి.




## కెసిఆర్ ఫామ్ హౌస్ కేసులో కొత్త కోణం

### సర్వేలో అధికారులు గుర్తించిన వైనం

### మొత్తం కుటుంబమంతా భూపత్రాలతో హాజరుకావాలని నోటీసులు ఇచ్చే అవకాశం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయిలో జరిపిన సర్వేలో మాత్రం కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తేలింది. దీంతో కనిపించకుండా పోయిన మిగిలిన 45 ఎకరాల భూమి ఎటు పోయింది? అది కెసిఆర్ ఫామ్ హౌస్ హద్దుల్లోకి కలిసిపోయిందా? ఈ వ్యత్యాసాన్ని నిగ్గు తేల్చేందుకు నేరుగా మాజీ సీఎం కేసీఆర్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు

- మిగతా 3 వ పేజీలో

## ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్

### ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్

ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్

ఓట్లు తీసేస్తే రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారని హెచ్చరిక



## భాగ్యనగరానికి ట్రాఫిక్ ముప్పు!

### వన్ వేతో సరిపెడుతున్న వైనం

కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్ పాసేజ్‌లు లేనట్టే

ఎలివేటెడ్ కారిడార్ మాత్రమే..

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో అత్యంత రద్దీ ఉన్న ప్రాంతం కేబీఆర్ పార్క్. దాని చుట్టూ బృహత్తర ఫ్లైఓవర్ నెట్వర్క్ ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన సన్నాహాలు కూడా మొదలు పెట్టింది. దాదాపు 1100 కోట్ల రూపాయల వ్యయంతో కేబీఆర్ పార్కు పరిసరాల్లోని ఆరు ప్రధాన జంక్షన్లో వద్ద ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల

మిగతా 2లో

## కేటీఆర్‌కు అస్వస్థత!

### తీవ్ర జ్వరంతో బాధపడుతున్న గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

పార్టీ శ్రేణుల్లో ఆందోళన



**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** గులాబీ పార్టీ అగ్రనేత కేటీఆర్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. తీవ్రమైన వైరల్ జ్వరం, నువ్వు తరహా లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు.




## నాయకులారా జాగ్రత్త!

ప్రజల మధ్యకు వచ్చేటప్పుడు ప్రజా ప్రతినిధులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరించిన కొన్ని రకాల ఇబ్బందులు తప్పవు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ.. ఓ విద్యార్థినితో వ్యవహరించిన తీరు సోషల్ మీడియాలో దుమారానికి దారితీసింది. మహాలక్ష్మి పథకం గురించి ప్రచారం చేసుకునేందుకు ప్రజాప్రతినిధిగా బస్సు ఎక్కారు రంగారెడ్డి.

### ప్రజా జీవితంలో నిర్లక్ష్యానికి తప్పదు మూల్యం

- నిత్యం వెంటాడుతుంది సోషల్ మీడియా
- 10 సెకండ్ల వీడియో రాజకీయ చరిత్రను కనుమరుగు చేస్తుంది
- మల్ రెడ్డి రంగారెడ్డి ఎపిసోడ్ తో దీనిపై చర్చ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఈ క్రమంలో ఓ విద్యార్థిని ని అనుచితంగా తాగారంటూ విమర్శలు వచ్చాయి. ఆ వీడియోలో మల్ రెడ్డి రంగారెడ్డి బాడీ లాంగ్వేజ్ మాత్రం నెటిజన్లను, విపక్షాలను తీవ్రస్థాయిలో ఆగ్రహానికి గురిచేసింది. అయితే దీనిపై స్పందించారు మల్ రెడ్డి రంగారెడ్డి. వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు.



## ఉద్యమంలా అమరావతి!

చురుగ్గా నిర్మాణ పనులు ..41 వేల మందితో సాగుతున్న నిర్మాణం

2028 నాటికి మొదటి దశ పూర్తి చేయాలన్నది లక్ష్యం

**క్రైమ్ మిర్రర్, అమరావతి బ్యూరో:** అమరావతి రాజధాని నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూటమి వచ్చిన తరువాత

మిగతా 3లో

## జనసేనలోకి కోలగట్ల!

వైసీపీని వీడేందుకు మాజీ డిప్యూటీ స్పీకర్ నిర్ణయం

గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా..

కుమార్తె భవిష్యత్తు కోసం స్ట్రాంగ్ డెసిషన్



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా షాక్ లు తగులుతున్నాయి. మొన్ననే విజయనగరం జడ్పీ చైర్మన్, బొత్స సత్యనారాయణ మేనల్లుడు చిన్న శ్రీను పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో ఒక్కసారిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కలకలం చోటు చేసుకుంది. నేను సంక్షోభంలో కూరుకుపోయింది. ఇప్పుడు మరో నేత

మిగతా 2లో



## మున్సిపల్ ఎన్నికలు షురూ!

12న షెడ్యూల్

తరువాత ఎంపీటీసీలు, జడ్పీటిసి లకు..

చివరిగా పంచాయితీలకు

సన్నాహాలు మొదలుపెట్టిన ఎన్నికల సంఘం




**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ కు దాదాపు ముహూర్తం ఫిక్స్ అయింది. సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం వెలువడిన వెంటనే షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల సంఘం తుది కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్ల పైన అంచనాలు సిద్ధం అయినట్లు సమాచారం. రాజకీయంగా కూటమి, వైసిపి ఎన్నికలకు సమాయత్తం అవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలపై మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. దాదాపు అన్ని స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లో కైవసం చేసుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు.

మిగతా 3లో

## నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం?!

జగన్మోహన్ రెడ్డి షాకింగ్ నిర్ణయం

మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో జగన్మోహన్ రెడ్డి దూకుడు పెంచుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తిగా దృష్టి సారిస్తున్నారు.

మిగతా 2లో

## జనసేనకు ఆ నాలుగు!

కాకినాడ, మచిలీపట్నం, ఏలూరు, విజయనగరం ఇచ్చే అవకాశం

జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం మునిసిపాలిటీలు ఆ పార్టీకే

విశాఖ కోసం పట్టుపడుతున్న బిజెపి ..తిరుపతి ఇస్తామంటున్న టిడిపి

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కూటమి కసరత్తు ప్రారంభం





# నాయకులారా జాగ్రత్త!

(మొదటి పేజీ తరువాయి)

కానీ అప్పటికే జరగాల్సిన పొలిటికల్ డామేజ్.. జరిగిపోయింది.

**మల్ రెడ్డి రంగారెడ్డి స్పందన..**

అయితే ఈ వీడియో పై తీవ్ర విమర్శలు చెలరేగిన నేపథ్యంలో మల్ రెడ్డి రంగారెడ్డి స్పందించారు. వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. తాను ఆ అమ్మాయిని కూతురిలా భావించానని.. తండ్రి స్థానంలో ఉండి వాత్సల్యంతో ప్రేమను మాత్రమే చూపించానని.. ఎలాంటి తప్పుడు ఆలోచనలు లేవని వివరణ ఇచ్చుకున్నారు. మల్ రెడ్డి చెప్పిన మాటలు నిజమే కావచ్చు కానీ.. ఆయన మనసులో చెడు ఆలోచన లేకపోవచ్చు కానీ.. సమాజం వేరే దృష్టితో చూస్తుందన్న విషయాన్ని ఆయన గ్రహించాలి. మనకు అది మంచి ఉద్దేశ్యమే కావచ్చు. కానీ ప్రజలు తప్పుడుగా చూసే అవకాశం ఉందన్న విషయాన్ని గుర్తించడం చాలా మేలు. ప్రజా జీవితంలో ఉన్నవాళ్లు ఈ విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచన చేసుకోవాలి.

**నాయకుల విషయంలో భిన్నం.**

ప్రస్తుతం సోషల్ మీడియా రాజ్యమేలుతున్న రోజులు ఇవి. నిత్యం కాపు కాసి ఉంటుంది సోషల్ మీడియా. రాజకీయ నాయకులను సమాజం సాధారణ దృష్టితో చూడదు. ఒక సామాన్యుడు తండ్రిలా ప్రేమ చూపించిన అర్థం చేసుకునే సమాజం.. అదే పని ఒక రాజకీయ నాయకుడు పబ్లిక్ స్పేస్లో చేస్తే అంత సులభంగా, పాజిటివ్గా తీసుకోదు. రాజకీయ నేతల ప్రతి అడుగును, ప్రతి కదలికను అనుమానంతో, విమర్శనాత్మక కోణంలోనే చూస్తుంది. ఈ కట్టిన వాస్తవాన్ని ప్రజా జీవితంలో ఉన్న నాయకులు విధిగా గుర్తించాలి. తమ కళ్ళ ఎదుట ఉన్న కెమెరాలు, స్మార్ట్ ఫోన్లు మాత్రమే కాకుండా.. నిత్యం వెంటాడే శోధన ఒకటి ఉంటుందని గ్రహించాలి.

**భూతద్దంతో నిఘా..**

రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకులు ఇప్పుడు డిజిటల్ మీడియాను ఎదుర్కోవడం పెద్ద ఇబ్బందికరంగా మారుతుంది. ప్రజా జీవితంలో గొప్ప అనుభవం ఉండవచ్చు కానీ.. చిన్నపాటి తప్పిదాన్ని కూడా భూతద్దంలో పెట్టి చూపిస్తుంది డిజిటల్ మీడియా.. నా ఉద్దేశం మంచిదే కదా.. ఏమవుతుందిలే అనే అమాయకత్వం, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే మాత్రం మల్ రెడ్డి రంగారెడ్డి ఎదుర్కొంటున్న చేదు పరిస్థితులను, పరువు నష్టాన్ని భరించక తప్పదు. ఈ వివాదం ఒక్క మల్రెడ్డి రంగారెడ్డి కి మాత్రమే పరిమితం అయింది కాదు. రాజకీయ నాయకులందరికీ ఒక బలమైన హెచ్చరిక. నిత్యం విపక్షాలు, ట్రోల్ గ్రూపులు నాయకుల తప్పిదాలను గుర్తించేందుకు పాచుకుని కూర్చుంటాయి. ఒక చిన్న పది సెకండ్ల వీడియో క్లిప్ ఒక రాజకీయ నాయకుడి దశాబ్దాల రాజకీయ ప్రతిష్టను మసకబార్చుతుంది. అందుకే ఇటువంటి వాటి విషయంలో నాయకులు ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది.

## కేటీఆర్ వస్తే ఖైరతాబాద్‌లో తేల్చుకుందాం..

### దానం నాగేందర్ ఛాలెంజ్

హైదరాబాద్, అక్టోబర్ : ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో కాంగ్రెస్ నేత దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌నే ప్రత్యర్థిగా కోరుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఖైరతాబాద్‌లో తనతో తలపడాలని, ఎన్నికల ఫలితంతో ఎవరి బలం ఏమిటో నిరూపించుకుందామని సవాల్ చేశారు. ఈ వ్యాఖ్యలు ఇండియా కూటమి నిర్వహించిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో వెలువడ్డాయి.దానం నాగేందర్ తనకు ఉప ఎన్నిక కొత్త కాదన్నట్లుగా మాట్లాడారు. అవసరమైన సన్నాహాలతో తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఖైరతాబాద్‌లో తన రాజకీయ ప్రభావాన్ని ప్రస్తావిస్తూ.. తన పేరు ఒక ప్రత్యేక గుర్తింపుగా మారిందని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నిక ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయం కూడా వెల్లడవుతుందని అన్నారు. రోవైపు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కొనసాగుతున్న రాజకీయ వివాదాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

# కేటీఆర్‌కు అస్వస్థత!

ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ప్రకటించారు. వాతావరణ మార్పులు, కాలానుగుణంగా వ్యాపిస్తున్న ఇన్ఫెక్షన్ల ప్రభావంతో ఒక్కసారిగా నీరసం, జ్వరం బారిన పడ్డారు. దీంతో వైద్యుల పర్యవేక్షణలోకి కేటీఆర్ వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతానికి ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేక పోయింది.. కానీ వైద్య నిపుణుల సూచనల మేరకు ఆయన ఇంటి వద్ద అవసరమైన పూర్తిస్థాయి చికిత్స తీసుకుంటున్నారు. దీంతో రెండు రోజులపాటు ఆయన రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండనున్నారు.

**రెండు రోజుల విరామం..**

ఆరోగ్య సమస్యల కారణంగా రోజువారి కార్యక్రమాలకు, వ్యక్తిగత షెడ్యూలకు తాత్కాలిక విరామం ప్రకటించారు కేటీఆర్. నిపుణులైన వైద్యులు అవసరమైన మందులు, పూర్తి విశ్రాంతిని సూచించారని.. శరీరం కోలుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ హఠాత్ అస్వస్థత వార్తతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. అయితే కేటీఆర్ త్వరగా కోలుకుంటున్నారని.. ఆయన విషయంలో ఇబ్బందులు లేవని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**కేటీఆర్ ట్వీట్..**

మరోవైపు కేటీఆర్ ట్వీట్ చేశారు. తాను అనారోగ్యానికి గురైన విషయాన్ని పంచుకున్నారు. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని.. మరో రెండు మూడు రోజుల్లో కోలుకొని పూర్తి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని చెప్పడంతో శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. కొద్ది రోజుల కిందట కేటీఆర్ కుమారుడు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో కేసీఆర్ స్వయంగా వెళ్లి మనవడిని పరామర్శించారు. ఇప్పుడు కేటీఆర్ అనారోగ్యం బారిన పడ్డారు. ఆయన త్వరగా కోలుకోవాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

# భాగ్యనగరానికి ట్రాఫిక్ ముప్పు!



పనులకు ప్రణాళికలు రచించారు. ఆ పనుల కోసం ప్రయోగాత్మకంగా క్లాక్ వైజ్ వన్ వే ట్రాఫిక్ విధానం అమలు చేస్తున్నారు. కానీ ఇప్పుడు వన్ వే టు ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమయ్యాయి. దీంతో మెగా ప్రాజెక్టును పక్కన పెట్టేశారు. కేవలం ఒక్క ఎలివేటెడ్ కారిడార్ మాత్రమే ముందుకు తీసుకెళుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతానికి అయితే ఓకే. భవిష్యత్తులో నగరంలో ట్రాఫిక్ పెరిగితే పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు ప్రశ్న.

**పెరుగుతున్న వాహన రద్దీ..**

వాస్తవానికి హైదరాబాద్ మహానగరంలో ప్రతి నెల వేల సంఖ్యలో వాహనాలు పెరుగుతూ వస్తున్నాయి. కానీ దానికి అనుగుణంగా రోడ్ల విస్తరణ పెరగడం లేదు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి హై ఎండ్ ఏరియాలో రోడ్లను మరింత వెడల్పు చేసేందుకు స్థలం లభ్యం కావడం లేదు. ఐటి కారిడార్ తో కూడిన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లను కోర్ సిటీతో కలిపే ప్రధాన వారధి కేబీఆర్ పార్క్ జంక్షన్. రానున్న ఐదు లేదా 10 ఏళ్లలో నగర జనాభా, వాహనాల రద్దీ మరింత రెట్టింపు అయినప్పుడు.. ప్రస్తుత రోడ్డు స్థాయిపై ఆధారపడిన వందే వ్యవస్థ ఆ లోడ్ ను పట్టుకోగలదా? అంటే కచ్చితంగా లేదనే చెప్పాలి. రేపు వాహనాల రద్దీ పెరిగి మళ్ళీ గంటల తరబడి ట్రాఫిక్ జాములు మొదలైనప్పుడు... కొత్తగా ఫ్లైఓవర్లు లేదా అండర్ పాస్ ల ఆలోచన చేయకుండా ఉండగలమా అనేది ఆలోచించాల్సిన విషయం.

**దీర్ఘకాలిక ప్లానింగ్ అవసరం..**

అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్కు దీర్ఘకాలిక అర్బన్ ప్లానింగ్ చాలా అవసరం. రోడ్లను వెడల్పు చేసే వీసులుబాటు లేనప్పుడు.. గగన స్థలంలో ఫ్లైఓవర్లు, భూగర్భంలో అండర్ పాస్ ల ద్వారా గ్రేడ్ సపరేటర్లను నిర్మించడమే ఏకైక మార్గం. కానీ ఇప్పటికిప్పుడు నిధుల కొరతతోనో, చెట్ల తొలగింపు వివాదాలు, విఐపి ల ప్రయోజనాల ఒత్తిడితోనో ప్రాజెక్టును రద్దు చేసుకుంటే.. రేపటి రోజున మళ్లీ ఇదే నిర్మాణాలను చేపట్టాల్సి వస్తే ఖర్చు రెట్టింపు అవుతుంది. మరింత తీవ్రమైన ట్రాఫిక్ అస్తవ్యస్త నగరంగా భరించాల్సి వస్తుంది. ఇప్పటికే రోడ్లు ఇరుకుగా మారిపోతుంటే.. వందే మార్గంలో కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి రావడం వల్ల పెట్రోల్ భారం, సమయం వృధా కావడం ఖాయం. అందుకే శాశ్వత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అర్బన్ పాలసీని అమలు చేస్తే బాగుంటుంది.

# నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం?!

(మొదటి పేజీ తరువాయి)



ముందుగా మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని చూస్తున్నారు. అందులో భాగంగా నెల్లూరు మేయర్ అభ్యర్థిగా రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరును ప్రకటించారు. ఆ పార్టీ తరఫున అధికారికంగా ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైసీపీ ప్రకటించిన మొట్టమొదటి మేయర్ అభ్యర్థి ఆయనే కావడం విశేషం. తద్వారా మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టిగా నిలబడుతుందని సంకేతాలు పంపారు జగన్మోహన్ రెడ్డి.

**కుటుంబంలో చీలిక..**

వాస్తవానికి ఆనం కుటుంబంలో చాలా కాలం క్రితమే చీలిక వచ్చింది. ఆ కుటుంబం అడ్డగోలుగా చీలిపోయింది. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి ఉన్నారు. అయితే సోదరుడితో విజయ్ కుమార్ రెడ్డికి అంతగా సఖ్యత లేదు. విజయ్ కుమార్ రెడ్డి చాలాకాలంగా పార్టీలోనే కొనసాగుతూ వస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల వేల కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టిడిపిలోకి ఫిరాయించారు. అప్పుడే రూరల్ నియోజకవర్గ బాధ్యతలను విజయ్ కుమార్ రెడ్డికి అప్పగించారు జగన్. మరోవైపు విజయ్ కుమార్ రెడ్డి భార్య అరుణమ్మ గతంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా పనిచేశారు. ఆనం కుటుంబానికి నెల్లూరు నగరం తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును దృష్టిలో పెట్టుకొని మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

**గతంలో బలం ఎక్కువ..**

వాస్తవానికి నెల్లూరు నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా బలంగా ఉండేది. కానీ గత ఎన్నికల్లో ముందు, ఫలితాలు వచ్చిన తర్వాత చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ జిల్లాలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఆదాల ప్రభాకర్ రెడ్డి, కాకాని గోవర్ధన్ రెడ్డిలు ఉన్నారు. అయితే వారి మధ్య అంతగా సఖ్యత లేదు. ఇప్పుడు జగన్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరును మేయర్ కు ప్రకటించారు. అయితే ఆయనను సైతం వైసీపీ కీలక నేతలు విభేదిస్తూ వచ్చారు. అందుకే ఎంతవరకు సహకరిస్తారు అనేది అనుమానమే. ఇంకోవైపు నెల్లూరు సిటీకి మంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తుండగా.. రూరల్ నియోజకవర్గం నుంచి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఉన్నారు. పొలిటికల్ గా మంచి దూకుడు ప్రదర్శిస్తున్నారు. వారిని కాదని ఆనం విజయ్ కుమార్ రెడ్డి ఎంతవరకు సక్సెస్ అవుతారు అన్నది చూడాలి.

# జనసేనకు ఆ నాలుగు!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా సిద్ధమవుతున్నాయి. సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం వెలువడిన వెంటనే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల కానుంది. అయితే ఇప్పటికే అధికార కూటమితో పాటు విపక్ష వైసిపి గట్టి ప్రయత్నాలు ప్రారంభించాయి. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో గట్టి అభ్యర్థులను రంగంలోకి దించాలని చూస్తున్నాయి. కూటమిలో మూడు పార్టీల మధ్య పదవుల సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. జనసేన కోరుకుంటున్న మేయర్ సీట్లపై స్పష్టత వస్తోంది. తమకు కేటాయించాల్సిన పదవుల కు సంబంధించిన జాబితాను పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు అందించినట్లు సమాచారం.

**ఈ నెల చివరిలోగా..**

ఈనెల చివరిలోగా మున్సిపల్ ఎన్నికలు పూర్తిచేయాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. ఈనెల 12న ఎలక్షన్ షెడ్యూల్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే దాదాపు ఒక కొలిక్కి వచ్చిందని.. విశాఖ, విజయవాడ, తిరుపతి మేయర్ పదవుల పైనే ఆ మూడు పార్టీల మధ్య ఒక నిర్ణయం జరగాల్సి ఉంది. అయితే ఈ మూడు నగరాలను ఆ పార్టీలు కోరుకుంటున్నాయి. విశాఖ విషయంలో బిజెపి పట్టుబడుతోంది. అయితే తిరుపతి ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు సమాచారం. మరోవైపు విజయవాడ, ఏలూరు, ఒంగోలు, కాకినాడ, మచిలీపట్నం స్థానాలను జనసేన కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే కాకినాడ, మచిలీపట్నం, ఏలూరు, విజయనగరం స్థానాలు ఇచ్చేందుకు టిడిపి అంగీకరించినట్లు కూడా తెలుస్తోంది. ఒంగోలు, నెల్లూరు విషయంలోనే ఒక నిర్ణయానికి రావాల్సి ఉంది.

**ఎస్టీ నియోజకవర్గాల్లో సైతం..**

మున్సిపాలిటీలకు సంబంధించి జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట తమ పార్టీకి విడిచి పెట్టాలని పవన్ కోరుతున్నారు. ఎస్టీ నియోజకవర్గాల్లో మున్సిపాలిటీలపై కూడా ఆయన దృష్టి పెట్టారు. ఒకవేళ మున్సిపల్ ఎన్నికల్లో తమకు సీట్లు తగ్గిస్తే.. జిల్లా పరిషత్తులలో ప్రాతినిధ్యం పెంచాలని బిజెపి కోరుతున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే వైసీపీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దించుతోంది. నెల్లూరు నుంచి ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరును ప్రకటించారు. వైసిపి దూకుడు మీద ఉండడంతో మూడు పార్టీలు జాగ్రత్త పడుతున్నాయి. మరోవైపు జనసేనతో పాటు బిజెపికి బలం ఉన్నచోట మాత్రమే పోటీలో ఉండేలా టిడిపి చూస్తోంది. వరకు ఏం జరుగుతుందో చూడాలి.

# జనసేనలోకి కోలగట్ల!

జనసేనలోకి చేరుతారని ప్రచారం నడుస్తోంది. వైసిపి హయాంలో డిప్యూటీ స్పీకర్గా పదవి చేపట్టిన కోలగట్ల వీరభద్ర స్వామి వైసీపీకి గుడ్ బై చెబుతారని పొలిటికల్ వర్గాల్లో తెగ ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. తన అనుచరులు, ద్వితీయ శ్రేణి నాయకులతో కలిసి అధికార కూటమి వైపు అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో తెగ ప్రచారం జరుగుతోంది.

**కీలక మంతనాలు..**

ప్రస్తుతం జనసేన అగ్రనాయకత్వంతో వీరభద్ర స్వామి మంతనాలు చేస్తున్నట్లు కూడా ఉత్తరాంధ్ర వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇటీవల కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీగా నేతలు గుడ్ బై చెబుతున్న సంగతి తెలిసిందే. దీంతో కోలగట్ల వీరభద్ర స్వామి రాజకీయ భవిష్యత్తు కోసం జనసేనలో చేరితే బాగుంటుందన్న నిర్ణయానికి వచ్చారని తెలుస్తోంది. ఉత్తరాంధ్రకు చెందిన జనసేన నేతలతో ఆయన చర్చలు జరుపుతున్నారని సమాచారం. ఉమ్మడి విజయనగరంలోని పట్టున్న నేతగా కోలగట్ల వీరభద్ర స్వామి ఉన్నారు. అశోక్ గజపతిరాజు పై గెలిచి జైంట్ కిల్లర్ గా నిలిచారు. రెండుసార్లు విజయనగరం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం ఆయన జనసేనలో చేరుతారని తెలుస్తోంది.

**జిల్లా పై పెను ప్రభావం..**

చిన్న శ్రీను రాజీనామాతో విజయనగరం జిల్లాలో వైసిపి కాకావికలం అవుతోంది. ఇప్పుడు కోలగట్ల పార్టీ మారితే మాత్రం జిల్లాలో పెను ప్రభావం చూపడం ఖాయం. కేవలం పార్టీ మారడమే కాకుండా.. రాబోయే రోజుల్లో జిల్లా స్థాయిలో కీలకమైన బాధ్యతలను చేపట్టేలా ఆయన జనసేన అధిష్టానంతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ప్రకారం జరుగుతోంది. ఉత్తరాంధ్రలో కూటమిని మరింత బలోపేతం చేసే దిశగా జనసేన నాయకత్వం కూడా బలమైన సామాజిక వర్గాలను, అనుభవం ఉన్న నేతలను తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తోంది. విజయనగరం రాజకీయాల్లో చక్రం తిప్పిన కోలగట్ల జనసేన గూటికి చేరితే.. అది ఉమ్మడి జిల్లాలో వైసీపీకి కోలుకోలేని దెబ్బ కానుంది.

## ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..

### బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి

**ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి**

**తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోస్క్ బస్టాప్‌పై బాంబుల వర్షం**

**ఘటనలో 33 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన వైనం**

**ఈ ఏడాదిలో ఇదే అతి పెద్ద సింగిల్ అటాక్**

**ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ హెచ్చరిక**



ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోస్క్ పట్టణంలో రద్దీగా ఉన్న ఒక బస్టాప్‌పై జరిగిన రాకెట్ దాడిలో 33 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడగా, ఈ ఘోర దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ దాడి ధాటికి బస్టాప్ పరిసరాలన్నీ రక్తసిక్తమయ్యాయి. మృతదేహాలు, శిథిలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఏడాదిలో రష్యా జరిపిన దాడుల్లో పౌరులు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ తీవ్రంగా స్పందించారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ ఘాతుకానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. "ఇది ముమ్మాటికీ ఉగ్రవాద చర్య. దీనికి తగిన ప్రతీకారం తీర్చుకుంటాం" అని ఆయన హెచ్చరించారు. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న రష్యాపై అంతర్జాతీయ సమాజం ఒత్తిడి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనతో ఇరు దేశాల మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

క్రైమ్ మిర్రర్
తెలంగాణ
శుక్రవారం
9-10-2026


# ఆ 45 ఎకరాలు ఎక్కడ?!

(మొదటి పేజీ తరువాయి)

తమ వద్ద ఉన్న భూమి పత్రాలతో సహా హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధపడుతోంది. ఇది తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనమే.

**అంతా వ్యూహం ప్రకారమే..**

ఒక వ్యూహం ప్రకారం రేవంత్ రెడ్డి సర్కార్ అడుగులు వేస్తోంది. ఇప్పటికే ధరణి, భూ రికార్డుల అక్రమాలపై ప్రత్యేక నివేదికలు తెప్పించుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఆ 45 ఎకరాలు ఎక్కడున్నాయో తేల్చాలని ఆదేశించడమే కాకుండా.. అక్కడ అమరవీరుల కాలనీ నిర్మిస్తామని ప్రకటించి.. ఈ అంశాన్ని రాజకీయ, భావోద్వేగ రంగు పులిమారు. కేవలం కాగితాల పరిశీలనకే పరిమితం కాకుండా.. మొత్తం ఫామ్ హౌస్ కాంపౌండ్ లోపల సమగ్ర కొలతలు వేయించేందుకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



ఇప్పటివరకు బయట నుంచి సాగిన మాటల యుద్ధం.. ఇప్పుడు ఏకంగా కెసిఆర్ వ్యక్తిగత స్థావరం, వ్యవసాయ ఎస్టేట్ గేట్లు దాటి లోపలికి ప్రవేశించే పరిస్థితి కనిపిస్తోంది.

**అదే జరిగితే రచ్చే..**

ప్రధానంగా ఆ 45 ఎకరాల ప్రభుత్వ భూమి ఫామ్ హౌస్ ఫెన్సింగ్ లోపల.. అందులోనూ ఎస్టేట్ నడిబొడ్డున ఉందని సర్వేలో తేలితే జరిగే రాజకీయ రచ్చ ఊహకు అందదు. ఒకవేళ ఆ భూమిని స్వాధీనం చేసుకోవాల్సి వస్తే.. పచ్చటి ఫార్మ్ హౌస్ కాంపౌండ్ మధ్యలో ప్రభుత్వ కంచెలు వేయడం, స్వాధీనం పేరుతో మార్కింగ్ లు చేయడం అనివార్యంగా మారుతుంది. దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని శాసించిన ఒక తిరుగులేని నేత ఇంటి ప్రాంగణంలోనే రెవెన్యూ సర్వే జరగడం, దానికి పోలీస్ పహారా తోడు కావడం వంటి పరిణామాలు అస్సలు ఊహించినవి. మున్ముందు తెలంగాణ పొలిటికల్స్ లో హై వోల్టేజ్ సర్కస్ నడవడం ఖాయం. గులాబీ పార్టీకి ఇది అత్యంత క్లిష్టమైన రాజకీయ సవాల్. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతలపై ఏ తరహా వ్యూహాలు అమలు చేశారో.. ఇప్పుడు అంతకంటే రెట్టింపు తీవ్రతతో రేవంత్ యంత్రాంగం కేసీఆర్ కంచుకోట చుట్టూ ఉచ్చు బిగిస్తోంది.

## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ.. రాష్ట్రాభివృద్ధిపై కీలక వినతులు

**ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ**

**గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రతిపాదన**

**రాష్ట్రంలో వర్షాభావం, వ్యవసాయ సంక్షోభంపై ప్రధానికి వివరణ**

**విశాఖ మెట్రో, అమరావతి ఓఆర్ఆర్‌కు సహకారం కోరిన సీఎం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలపై ప్రధానితో చర్చించారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి కష్టాలు తీరతాయని, ఈ బృహత్తర ప్రాజెక్టుపై కేంద్రం దృష్టి సారించాలని చంద్రబాబు కీలక ప్రతిపాదన చేశారు. ప్రధానితో జరిగిన చర్చల్లో భాగంగా, గోదావరి–కావేరి నదుల అనుసంధానం పూర్తయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు సస్యశ్యామలమవుతాయని సీఎం వివరించారు. గతంలో ఎన్డీఏ హయాంలోనే రహదారుల నెట్వర్క్, పవర్ గ్రిడ్ వంటివి సాధ్యమయ్యాయని, అదే స్ఫూర్తితో నదుల అనుసంధానం ద్వారా దేశంలో "వాటర్ గ్రిడ్" ఏర్పాటు చేయాలని సూచించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని, ఈ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలని ప్రధానిని కోరారు.

# ఉద్యమంలా అమరావతి!

పునర్నిర్మాణ పనులు ప్రారంభించింది. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా శరవేగంగా పనులు ఊపందుకుంటున్నాయి. ప్రజా రాజధానిని అనుకున్న గడువులోగా పూర్తిచేసి.. ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనుల వేగాన్ని మరింతగా పెంచింది. ప్రస్తుతం అమరావతి పరిధిలో ఏకకాలంలో 152 ప్రాజెక్టుల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. దాదాపు 41 వేల మంది కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్నారు. 2028 నాటికి మొదటి విడత పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.

**రికార్డ్ స్థాయిలో పనులు..**

పనులను వేగవంతం చేసే క్రమంలో.. ఒక్క సెప్టెంబర్ నెలలోనే ఏకంగా రూ.1345 కోట్ల విలువైన నిర్మాణ పనులను పూర్తి చేసి రికార్డు సృష్టించారు. మౌలిక వసతులు, రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. అమరావతికి సైతం ఒక రూపం వస్తోంది. గతంతో పోల్చుకుంటే నిర్మాణ వేగం మూడు రెట్లు పెరిగింది. కర్నూల్ లో పారదర్శకతతో పాటు నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు యంత్రాంగానికి అమరావతి రాజధాని పనుల విషయంలో దిశా నిర్దేశం చేశారు. ఇప్పటివరకు సాధించిన వేగం సంతృప్తినిచ్చిందని.. భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి ఇది సరిపోదని స్పష్టం చేశారు. ప్రతినెల 2000 కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని డెడ్లైన్ విధించారు. నిర్మాణ సంస్థలు ఆధునిక యంత్రాలను, అదనపు మానవ వనరులను సమకూర్చుకుని.. మూడు షిఫ్టుల్లో పనులు కొనసాగించాలని ఆదేశించారు. సీఎం నిర్దేశించిన ఈ టార్గెట్ తో అధికార యంత్రాంగం సరికొత్త వ్యూహాలతో నిర్మాణ ప్రణాళికలను వేగవంతం చేస్తోంది.

**రాష్ట్ర ప్రభుత్వ నిశ్చయం..**

గత అనుభవాల దృష్ట్యా అమరావతి రాజధాని నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్న కృత నిశ్చయంతో ఉంది రాష్ట్ర ప్రభుత్వం. 2028 నాటికి మొదటి దశ పనులు పూర్తి చేసి ఒక రూపం తేవాలన్నది ప్రభుత్వ ఆశయం. 2029 ఎన్నికలకు ముందే అమరావతిలో కార్యకలాపాలు మొదలయ్యేలా తీర్చిదిద్దుతున్నారు. సీఎం చంద్రబాబు సంకల్పం, మంత్రి నారాయణ నిరంతర పర్యవేక్షణతో అమరావతి నిర్మాణ పనులు సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. నిధుల కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ బ్యాంకుల సహాయంతో పనులు పరుగులు పెడుతున్నాయి. నిర్ణీత గడువులోగా అమరావతిని పరిపాలన కేంద్రంగానే కాకుండా... ఆర్థిక, విజ్ఞాన ఆధారిత మహానగరంగా ఆవిష్కరించేందుకు అడుగులు వేగంగా పడుతున్నాయి.



## మోదీ చొరవతో అంగన్వాడీలకు భారీ నిధులు.....

**హఫీజ్ పేట్ బీజేపీ అధ్యక్షులు జితేందర్....**

**క్రైమ్ మిర్రర్ హఫీజ్ పేట్:** సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా హఫీజ్ పేట్ యూత్ కాలనీ అంగన్వాడీలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో "అంగన్ మిలన్ సేవా" నిర్వహించారు.గర్భిణులను సత్కరించి, పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ అనూష మహేష్ యాదవ్, జిల్లా కార్యదర్శి మాణిక్ రావు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ చొరవతో అంగన్వాడీలకు భారీ నిధులు వస్తున్నాయని, పోషకాహారంపై అవగాహన పెంచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జగన్ గౌడ్, ప్రభాకర్, పావని తదితరులు పాల్గొన్నారు.

## బోయగుబ్బ గ్రామానికి అరుదైన గుర్తింపు

**టిబీ రహిత గ్రామపంచాయతీగా ఎంపిక.. కలెక్టరేట్‌లో అభినందనలు**



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలంలోని బోయగుబ్బ గ్రామపంచాయతీ టిబీ రహిత గ్రామపంచాయతీగా ఎంపికై అరుదైన గుర్తింపు సాధించింది. టిబీ (క్షయ) నిర్మూలనలో గ్రామం సాధించిన ప్రగతిని గుర్తించిన జిల్లా యంత్రాంగం బోయగుబ్బ గ్రామాన్ని అభినందించింది.నల్గొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రశేఖర్ బడుగు, ఐఏఎస్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తదితరుల సమక్షంలో బోయగుబ్బ గ్రామ సర్పంచ్ శ్రీ రెగులగడ్డ స్వామి గౌడ్ను అభినందించారు. గ్రామంలో టిబీ నియంత్రణ, వ్యాధి నిర్ధారణ, చికిత్సపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, అనుమానిత కేసులను గుర్తించి వైద్య సేవలు అందించడంలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేసిన ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని అధికారులు పేర్కొన్నారు.చిట్యాల మండలంలోని గ్రామపంచాయతీల్లో బోయగుబ్బ గ్రామపంచాయతీకి టిబీ రహిత గ్రామపంచాయతీగా గుర్తింపు లభించడం గ్రామ ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. ఈ గుర్తింపు భవిష్యత్తులోనూ గ్రామాన్ని మరింత ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు షురూ!

సుప్రీం తీర్పు వచ్చిన వెంటనే.. ముందుగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. 12 నగరపాలక సంస్థలతోపాటు 100కు పైగా మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వివిధ న్యాయపరమైన చిక్కుళ్ళు వీడాయి. హైకోర్టు కేసులను కొట్టివేసింది. అదే సమయంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన పిటిషన్ కూడా కొట్టివేయడంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే దీనిపై సుప్రీం కోర్టులో తీర్పు వెలువడిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు.

**ఒకే విడతలో.. :** ఈ నెల 12న ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. అందుకు సంబంధించి పక్కా ఏర్పాట్లు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పట్టణ స్థానిక సంస్థలకు ఒకే విడతలు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉంది ఎన్నికల సంఘం. మున్సిపల్ ఎన్నికలు జరిగిన తర్వాత జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలు పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అటు తరువాత చివరిగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించి స్థానిక ప్రక్రియ ముగించాలన్న కోణంలో ఆలోచిస్తోంది ప్రభుత్వం. శుక్రవారం సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

**స్పష్టమైన ఆదేశాలు..**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు ఎస్పీలతో సమీక్షలు జరిపారు. ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ పై జిల్లాల యంత్రాంగాలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎన్నికల వాతావరణం మొదలైనట్టే.

## ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్

ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.



## తెలంగాణలో మండుతున్న ఎండలు..

తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు.రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# అధికారుల నిర్లక్ష్యం...

## మక్తా మహబూబ్‌పేట్ 241 డివిజన్‌లో బతుకమ్మ ఏర్పాట్లు శూన్యం....

**మియాపూర్ క్రైమ్ మిర్రర్ :** మక్తా మహబూబ్‌పేట్ 241 డివిజన్‌లో బతుకమ్మ పండుగ సమీపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి సరైన ఏర్పాట్లు చేయకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మలు ఆడుకునేందుకు అవసరమైన ప్రదేశాలను సిద్ధం చేయాలని, పారిశుధ్యం, లైటింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. బతుకమ్మ పండుగలో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మక్తా మహబూబ్‌పేట్ 241 డివిజన్‌లో



బతుకమ్మ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేయాలని కోరుతున్నాము. ప్రజల ఫిర్యాదులను ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రజలు కోరారు.




**ప్రభుత్వ భూమి అని రికార్డులు చెబుతున్నాయా..? మరి ప్రైవేట్ నిర్మాణానికి పునాది ఏంటి..?**

**సేల్ డీడ్ ఉంటే.. మదర్ డాక్యుమెంట్ ఎక్కడ..? కోర్టు ఆర్డర్ ఉంటే.. అసలు ఆర్డర్ ఏది..?**

**పర్మిషన్ లేదని సమాచారం.. అయినా నిర్మాణం ఎలా కొనసాగింది..? అధికారుల నిశ్శబ్దంపై అనుమానాలు..**

**రికార్డులు బయటపెడతారా..? లేక విచారణ పేరుతో ఫైళ్లు మూసేస్తారా..?**

**అధికారుల స్పందన వచ్చేంత వరకు.. ఖాజాగూడ 27/1 వ్యవహారంపై క్రైమ్ మిర్రర్ పరిశీలన కొనసాగుతుంది.**

క్రైమ్ మిర్రర్, తెలంగాణ స్టేట్ బ్యూరో

**రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామంలోని సర్వే నంబర్ 27/1 వ్యవహారం రోజురోజుకూ మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోంది. రెవెన్యూ రికార్డులు, RTI ద్వారా అందిన సమాచారం, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న నిర్మాణ పరిస్థితులను ఒకదానితో ఒకటి పోల్చితే.. అసలు ఈ భూమికి సంబంధించిన హక్కులు, నిర్మాణ అనుమతులు, పత్రాల చెల్లుబాటు వంటి అంశాలపై సమగ్ర విచారణ అవసరం మరింత స్పష్టమవుతోంది.**

**ప్రభుత్వ భూమి అయితే.. ప్రైవేట్ నిర్మాణం ఎలా..?**

సర్వే నంబర్ 27/1కు సంబంధించి ఆర×టీఐ ద్వారా వచ్చిన రెవెన్యూ సమాచారంలో భూమి ప్రభుత్వ భూమిగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఈ భూమిపై కోర్టు కేసులు, బిల్డింగ్ పర్మిషన్ల విషయంలోనూ సంబంధిత శాఖ నుంచి సమాచారం అందినట్లు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో నిర్మాణం కనిపిస్తుండటమే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ప్రభుత్వ భూమి అని రికార్డులు చెబుతున్నప్పుడు.. నిర్మాణానికి ఎవరు హక్కు కల్పించారు..?

**ప్రైవేట్ వ్యక్తులు హక్కు ఉందని చెబుతున్నట్లయితే.. ఆ హక్కుకు ఆధారమైన మూల పత్రం ఏమిటి..?**

ఇది తేలకుండా ఈ వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు తెరపడే పరిస్థితి కనిపించడం లేదు.

**"సేల్ డీడ్" ఒక్కటే సరిపోతుందా..?**

ఏదైనా రిజిస్ట్రేషన్ పత్రం ఆధారంగా భూమిపై హక్కు ఉందని ఎవరైనా పేర్కొంటున్నట్లయితే.. ఆ సేల్ డీడ్‌కు ముందు ఉన్న లింక్ డాక్యుమెంట్లు, మదర్ డాక్యుమెంట్, పూర్వపు హక్కుల చరిత్రను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒకవైపు ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డులు ఉంటే.. మరోవైపు ప్రైవేట్ హక్కును సూచించే రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటే.. ఈ రెండు రికార్డుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో తేల్చాల్సిందే. రిజిస్ట్రేషన్ శాఖ రికార్డులు ఏమంటున్నాయి..? రెవెన్యూ రికార్డులు ఏమంటున్నాయి..? రెండు శాఖల రికార్డులు ఒకే విషయాన్ని చెబుతున్నాయా..? ప్రజలకు తెలియాల్సిన అసలు విషయం ఇదే.

**కోర్టు ఆర్డర్ పేరుతో హక్కు వస్తుందా..?**

ఈ వ్యవహారంలో నకిలీ కోర్టు ఆర్డర్లు, నకిలీ పత్రాలపై ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో.. వాటి నిజానిజాలను సంబంధిత అధికారులు అధికారికంగా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఏదైనా కోర్టు ఉత్తర్వు ఆధారంగా భూమిపై హక్కు లేదా నిర్మాణానికి రక్షణ లభించిందని ఎవరైనా పేర్కొంటే.. ఆ కేసు నంబర్ ఏమిటి..? ఏ కోర్టులో విచారణ జరిగింది..? ఉత్తర్వు తేదీ ఏమిటి..? ఉత్తర్వులో అసలు ఏం ఉంది..? అన్న ప్రశ్నలకు సమాధానాలు రికార్డులతోనే రావాలి. నకిలీదైతే ఎవరు సృష్టించారు..? నిజమైనదైతే దాని ఆధారంగా ఏ చర్యలు జరిగాయి..?

**ఇది కూడా విచారణలో తేలాల్సిన అంశమే.**

**LRS.. రిజిస్ట్రేషన్.. పర్మిషన్.. మూడు శాఖలు ఒకే భూమిని ఎలా చూస్తున్నాయి..?**

సర్వే నంబర్ 27/1కు సంబంధించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు లేదా ప్రక్రియ ఏదైనా జరిగిందా..? జరిగితే ఎవరి పేరుతో జరిగింది..? ఏ పత్రాలు సమర్పించారు..? భూమి స్వభావాన్ని ఎలా చూపించారు..? అదేవిధంగా రిజిస్ట్రేషన్ శాఖలో ఈ భూమికి సంబంధించిన లావాదేవీలు జరిగాయా..? జరిగితే వాటికి ఆధారమైన పత్రాలు ఏమిటి..? ఇక నిర్మాణ అనుమతి విషయానికి వస్తే.. ప్రస్తుత నిర్మాణానికి సంబంధించిన Building Application Number, Sanctioned Plan, Ownership Documents, Proceedings, Occupancy Certificate వంటి రికార్డులు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలి. తెలంగాణలో బిల్డింగ్ పర్మిషన్ ప్రక్రియకు సంబంధించి అనుమతి పత్రాలు, ఆమోదిత ప్లాన్ వంటి వివరాలను అధికారిక వ్యవస్థ ద్వారా ధృవీకరించే అవకాశం ఉంది.




**క్రైమ్ మిర్రర్ ప్రశ్నిస్తోంది..**

ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్న సర్వే నంబర్ 27/1లో నిర్మాణానికి అసలు ఆధారం ఏమిటి..? సేల్ డీడ్ ఉంటే.. దాని మదర్ డాక్యుమెంట్ ఎక్కడ..? కోర్టు ఆర్డర్ ఉంటే.. దాని అసలు రికార్డు ఎక్కడ..? బిల్డింగ్ పర్మిషన్ ఉంటే.. ఎవరు మంజూరు చేశారు..? పర్మిషన్ లేకుంటే.. చర్యలు ఎందుకు లేవు..? రికార్డులు వేరుగా.. నిర్మాణం వేరుగా కనిపిస్తే.. బాధ్యత ఎవరిది..? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు పత్రాలతో, తేదీలతో, అధికారిక రికార్డులతో సమాధానం ఇవ్వాలి. అధికారుల స్పందన వచ్చేంత వరకు.. ఖాజాగూడ 27/1 వ్యవహారంపై క్రైమ్ మిర్రర్ పరిశీలన కొనసాగుతుంది.

## ఫైళ్లలో నిజం ఉందా..? నేలపై నిజం ఉందా..?

ఒకవైపు రికార్డులు.. మరోవైపు క్షేత్రస్థాయి నిర్మాణం. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసమే ఖాజాగూడ 27/1 వ్యవహారాన్ని మరింత మిస్టరీగా మారుస్తోంది. అధికారులు స్పందించాల్సింది వ్యక్తులపై కాదు.. రికార్డులపై. భూమి ప్రభుత్వద్దైతే.. దాని రక్షణకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ హక్కు చట్టబద్ధమైతే.. దానికి సంబంధించిన మూల పత్రాలను వెల్లడించాలి. నిర్మాణం చట్టబద్ధమైతే.. అనుమతి పత్రాలను చూపించాలి. అనుమతులు లేకుంటే.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

**అధికారులు ఒక్కసారి సైట్‌కు వెళ్తే..**

**అసలు నిజం బయటపడుతుందా..?**

- ఇప్పటివరకు జరిగిన చర్యలపై కూడా ప్రశ్నలు ఉన్నాయి. స్థల పరిశీలన జరిగిందా..? పంచనామా నిర్వహించారా..?
- నిర్మాణానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారా..? భూమి స్వభావాన్ని నిర్ధారించారా..? నిర్మాణ అనుమతి ఉంటే దాని కాపీని బయటపెడతారా..? అనుమతి లేకపోతే ఇప్పటివరకు ఏ చర్య తీసుకున్నారు..?
- ప్రజా ఆస్తికి సంబంధించిన అంశం అయితే కేవలం ఫైళ్లలో సమాధానం ఇవ్వడం కాకుండా.. క్షేత్రస్థాయి పరిస్థితిని కూడా అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**"పెద్దల అండ".. ప్రచారమేనా..? నిజమేనా..?**

- స్థానికంగా ప్రభావవంతమైన వ్యక్తుల అండ ఉందంటూ ప్రచారం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- అయితే ఇది కేవలం ప్రచారమా..? లేక వాస్తవంగా ఎవరి జోక్యం ఉందా..? అన్నది అధికారిక విచారణ ద్వారానే తేలాలి.
- ఎవరినీ ఆధారాలు లేకుండా తప్పుపట్టడం కాదు.. ఆరోపణలు నిజమైతే ఆధారాలతో బయటపెట్టాలి..
- అసత్యమైతే అధికారులే స్పష్టత ఇవ్వాలి. అదే పారదర్శకత.

**కలెక్టర్ స్థాయి విచారణకు ఇది సరిపోదా..?**

సర్వే నంబర్ 27/1 వ్యవహారంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్/ప్లానింగ్ తదితర శాఖల రికార్డులు పరస్పరం సంబంధం కలిగి ఉన్నందున.. ఒకే శాఖ విచారణతో కాకుండా సమగ్రంగా రికార్డులను పోల్చితే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది. భూమి ప్రభుత్వదా..? ప్రైవేటుదా..? ప్రైవేటుదైతే మూల హక్కు ఎక్కడి నుంచి వచ్చింది..? రిజిస్ట్రేషన్ ఏ ఆధారంతో జరిగింది..? ఎల్ఆర్ఎస్‌లో ఏం జరిగింది..? బిల్డింగ్ పర్మిషన్ ఎవరు ఇచ్చారు..? ఇచ్చి ఉంటే ఏ పత్రాలను పరిశీలించారు..? పర్మిషన్ లేకుంటే నిర్మాణంపై చర్య ఎందుకు లేదు..? ఇవే ఇప్పుడు అధికారుల ముందున్న కీలక ప్రశ్నలు.

## పోలీసుల తనిఖీల్లో గంజాయి పట్టివేత; ఇద్దరి అరెస్ట్

**రామకృష్ణాపూర్ అక్టోబర్ 8 (క్రైమ్ మిర్రర్):** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధారి మైసమ్మ ఆలయం వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి పట్టుబడింది. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న గోగు నికిల్, మసూద్ శ్రీరాంపూర్ కు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి గంజాయితో పాటు ఒక బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై జై శ్రీధర్ తెలిపారు.గురువారం ఉదయం జాతీయ రహదారిపై సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా, ఆలయం సమీపంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది వారిని చాకచక్యంగా పట్టుకుని తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న నల్లటి కవరులో గంజాయి లభించిందన్నారు. పంచుల సమక్షంలో పంచనామా జరిపి గంజాయితో పాటు వాహనాన్ని, ఫోన్‌ను సీజ్ చేశామని తెలిపారు.బెల్లంపల్లికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి ఈ గంజాయిని కొనుగోలు చేసి తెచ్చినట్లు విచారణలో నిందితులు ఒప్పుకున్నారని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రాంతంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా వినియోగానికి పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీధర్ హెచ్చరించారు.




## చందానగర్ లాడ్జిల యజమానులకు కౌన్సిలింగ్...

**క్రైమ్ మిర్రర్ చందానగర్:** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జి యజమానులు, మేనేజర్లకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు.లాడ్జిలో దిగే వారి ఐడి లను తప్పక తనిఖీ చేయాలని, వివరాలు పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. సీసీటీవీ లు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఫుటేజీ భద్రపరచాలని చెప్పారు.మైనర్లకు రూమ్ లు ఇవ్వడం, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు లాడ్జిలను వేదికగా మారనివ్వొద్దని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## పలువురికి నివాళులర్పించిన - సర్పంచ్ కాటం వెంకటేశం

**చిట్యాల క్రైమ్ మిర్రర్ :** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన మాలేగాం (70) అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె పార్థివదేహానికి పెద్దకాపర్తి సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం పూలమాల వేసి నివాళు లర్పించారు.



అదేవిధంగా గ్రామానికి చెందిన ఓర్సు వెంకన్న (బద్రి) (52) అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన పార్థివదేహానికి కూడా కాటం వెంకటేశం పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, తెలుసూరి నరసింహ, కురు యాదయ్య, గంటల రవీందర్ రెడ్డి, ఏర్పుల నరసింహ, సాగర్ల నాగరాజు, తోటకూరి బాలమల్లు, బైరగోని బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు కొనసాగిన జగ్గారెడ్డి, నిర్మల దీక్ష

## రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా సంగారెడ్డిలో నిరసన

## దీక్షా శిబిరానికి తరలివచ్చిన కాంగ్రెస్ నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు







సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 08: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి చేపట్టిన దీక్ష రెండో రోజు కొనసాగింది. రాహుల్ గాంధీ పోరాటానికి సంఘీభావంగా జగ్గారెడ్డి దంపతులు రాత్రింబవళ్లు దీక్షా శిబిరంలోనే నిరసన కొనసాగించారు. దీక్షకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సంగారెడ్డి ప్రజలు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి జగ్గారెడ్డి దంపతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఉద్యమం కొనసాగినంతకాలం తమ నిరసన కార్యక్రమాలు కూడా కొనసాగుతాయని తెలిపారు. దేశ ప్రజలు రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు. సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న రోజుల్లోనూ సంఘీభావ నిరసనలు కొనసాగిస్తామని వెల్లడించారు.కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, జగ్గారెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్, షూస్, బెల్టుల పంపిణీ

## పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** ప్రాథమిక పాఠశాల చిట్యాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత యూనిఫామ్స్, షూస్, బెల్టులను చిట్యాల పురపాలక చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, షూస్, టైలు, బెల్టులు, యూనిఫామ్స్‌తో కూడిన కిట్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో 173 మంది విద్యార్థులు ఉండగా తరగతి గదుల కొరత ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లి అదనపు తరగతి గదుల మంజూరుకు కృషి చేస్తానన్నారు.వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుక్కల లత రాజేష్, ప్రధానోపాధ్యాయులు కంచరకుంట్ల సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు వై.సరిత, ఎస్.సతీష్ కుమార్, ఏ.చైతన్య, జి.మహేశ్వరి, కె.మాధవి పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

## పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి

## డిప్యూటీ కలెక్టర్‌కు బీజేపీ కిసాన్ మోర్చా వినతి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, నాగర్‌కర్నూల్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. ఈ మేరకు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారాయణ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లాలో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతులకు ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏ. రాజేశ్వర్‌రెడ్డి, సంగనమోని అన్వేష్, ఉపాధ్యక్షులు సీతారామ్‌రెడ్డి, గడ్డం శేఖర్‌యాదవ్, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఇంద్రకంటి శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీపాల్‌రెడ్డి, కోశాధికారి లోహిత్‌రెడ్డి, మీడియా కన్వీనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు రహిత సమాజమే లక్ష్యం





## ఈ నెల 22 నుంచి నవంబరు 4 వరకు ఇంటింటి సర్వే

## డిఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్

**మంచిర్యాల అక్టోబర్ 8 (క్రైమ్ మిర్రర్)** జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22 నుంచి నవంబరు 4 వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. గురువారం జిల్లా కార్యాలయంలో డెప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్‌తో కలిసి నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లకు సమీక్ష, పునశ్చరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశా, ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి తమ పరిధిలోని గ్రామాల్లో సర్వే చేపడతారని వెల్లడించారు. కుష్టు బాధితులను ముందస్తుగా గుర్తించి రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

**అపోహలు వీడాలి..**

కుష్టు వ్యాధి మైకోబాక్టీరియం లేప్రే అనే బ్యాక్టీరియా వల్ల చర్మానికి, నరాలకు సోకుతుందని,లక్షణాలు బయటపడేందుకు మూడేళ్ల నుంచి ఐదేళ్ల సమయం పడుతుందన్నారు.ఇది వంశపారంపర్యం కాదని, శ్యాపం, పాపం అంతకంటే కాదని స్పష్టం చేశారు. బాధితులు సమాజంలో స్వేచ్ఛగా సాధారణ జీవితం గడపవచ్చని పేర్కొన్నారు. చర్మంపై సహజ రంగు లేదా రాగి రంగు మచ్చలు ఉండి, అక్కడ స్పర్శ లేకపోవడం వ్యాధి ప్రధాన లక్షణమని తెలిపారు.ప్రారంభ దశలోనే గుర్తిస్తే ఎండీటీ చికిత్స ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసి, వైకల్యం రాకుండా నివారించవచ్చని సూచించారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే సర్వేకు సంబంధించి పీహెచ్‌సీల వైద్యాధికారులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, రెండు రోజుల్లో పీహెచ్‌సీ స్థాయిలో సమావేశాలు నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్‌మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, అల్లాడి శ్రీనివాస్, రషీద్, సీహెచ్‌ఓలు తులసీదాస్, పున్నమయ్య, పుట్ట సత్తయ్య, శ్రీనివాస్, జిల్లా కుష్టు వ్యాధి సమన్వయకర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి దైద రవీందర్ ఆర్థిక సాయం



చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మండలం పెద్దకాపర్తిపెద్దకాపర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఓర్సు వెంకటేశం (బద్రి) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, డీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ కందిమల్ల శిశుపాల్ రెడ్డితో కలిసి వెంకటేశం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన దహన సంస్కారాల కోసం రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి, ఉపసర్పంచ్ ఓర్సు సైదులు, మాజీ వార్డు సభ్యుడు ఓర్సు శీను, చలమల మధుసూదన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి తిరుమలేష్, సీనియర్ నాయకులు వెంకన్న, ఇరాటి మహేష్, ఆవనగంటి మహేష్, మైల సత్యనారాయణ, గుండెపూరి మహేష్, శిరస్సు ఇద్దయ్య, కేశవోని మచ్చ గిరి, మైల యాదగిరి, శిరస్సు యాదగిరి, ఓర్సు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# టీబీ ముక్త భారత్ లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

## జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య






**మంచిర్యాల అక్టోబర్ 8 (క్రైమ్ మిర్రర్):** క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, టీబీ ముక్త్ భారత్ అభియాన్ లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. మంచిర్యాల జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి అదనపు కలెక్టర్ మాట్లాడారు. క్షయ వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని అధికారులకు సూచించారు.క్షయ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు న్యూఢిల్లీ నుంచి ప్రసారమైన జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ కార్యక్రమం జాతీయ స్థాయి ప్రారంభోత్సవాన్ని జిల్లా అధికారులు ప్రత్యేక తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.

**15 గ్రామ పంచాయతీలకు ప్రశంసా పత్రాలు**

టీబీ ముక్త్ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన జిల్లాలోని 15 గ్రామ పంచాయతీల సర్పంచులు, సంబంధిత సహాయక నర్సు మంత్రసానులు, ఆశా కార్యకర్తలకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం అన్ని గ్రామ పంచాయతీల్లో క్షయ వ్యాధిపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు రూపొందించిన ప్రత్యేక అవగాహన కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు.కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారులు, సర్పంచులు, సహాయక నర్సు మంత్రసానులు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జాతీయ క్యాడెట్ దళం, జాతీయ సేవా పథకం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.జిల్లా మాస్ మీడియా బృందం సభ్యులు బుక్క వెంకటేశ్వర్లు, అల్లాడి శ్రీనివాస్, రషీద్, సీహెచ్‌ఓలు నాందేవ్, కాకిరాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్ఎస్ పద్మ, దిశా సమన్వయకర్త నీలిమ బృందం, జిల్లా క్షయ వ్యాధి విభాగం సమన్వయకర్త సురేందర్ బృందం, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు హేయం

## అభివృద్ధిని బీఆర్ఎస్ ఓర్వలేకపోతోంది: కాంగ్రెస్



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 08: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని, అందుకే ఎమ్మెల్యే రంగారెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. మల్‌రెడ్డి రంగారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని జీహెచ్ఎంసీ తొర్రూరు, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షులు కొశికె ఐలయ్య, ఓర్సు శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం కమ్మగూడలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రంగారెడ్డి సోషల్ మీడియాలో వ్యక్తిగత పోస్టులు మానుకోవాలని హితవు పలికారు. ఫేక్ న్యూస్ పోస్టు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, 15ఏళ్లలో కిషన్‌రెడ్డి చేయని పనులు తాము చేసి చూపెడుతున్నామన్నారు. దీన్ని చూసి ఓర్వలేకే వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని, దీన్ని ఏమాత్రం సహించబోమన్నారు. తమ సహనాన్ని పరీక్షించవద్దని... తప్పుడు ప్రచారాలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంతం వెంకటరెడ్డి (జానీ), రేవల్లె యాదగిరి, దాసరి సుధాకర్ రెడ్డి, ఎల్మటి వెంకటరెడ్డి, డా.రాగ్యానాయక్, పొట్ల జంగయ్యగౌడ్, రాజునాయక్, చెక్క ప్రశాంత్, హన్మంత్ గౌడ్, పల్లె రాజు తదితరులు పాల్గొన్నారు.

# నేరేడుచర్ల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియామకం

## చైర్మన్ గా స్పందన, వైస్ చైర్మన్ గా భాస్కర్ రెడ్డి నియామకం

## 17 మందితో నూతన పాలకవర్గం ఏర్పాటు..రెండేళ్ల పాటు పదవీకాలం

**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గం నియమితమైంది.నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఐదవ పాలకవర్గాన్ని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో వ్యవసాయ, సహకార శాఖ జారీ చేసిన జీవో ఆర్టీ నంబర్ 687 ప్రకారం మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా రంగినేని స్పందన, వైస్ చైర్మన్‌గా మునగాల భాస్కర్ రెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశుసంపద మార్కెట్ల చట్టం -1966లోని సంబంధిత నిబంధనల ప్రకారం నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి రెండేళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ పాలకవర్గం కొనసాగనుంది.నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ



సభ్యులు రంగినేని స్పందన -- చైర్‌పర్సన్,మునగాల భాస్కర్ రెడ్డి వైస్ చైర్మన్,సూరోజు రవీంద్ర చారి,పోతురాజు జ్యోతి,బుర్రి వెంకటయ్య,రామావత్ వస్యా,ధనావత్ సైదులు,ఉట్కూరి సైదులు,కర్నం రామ నర్సయ్య,పల్లె కాశయ్య ,గడ్డం ప్రియాంక,కత్తి శ్రీనివాస్ రెడ్డి,పోల విశ్వనాథం,రెబ్బె రమేష్, అధికారిక సభ్యులు జిల్లా మార్కెటింగ్ అధికారి,సహాయ వ్యవసాయ సంచాలకులు, హుజూర్‌నగర్.మున్సిపల్ చైర్మన్, నేరేడుచర్ల.నూతన పాలకవర్గంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు 12 మంది ఇతర సభ్యులు, ముగ్గురు అధికారిక సభ్యులకు స్థానం కల్పించారు. వ్యవసాయ, సహకార శాఖ ఏపీసీ అండ్ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్ పేరుతో ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన పాలకవర్గ నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను తెలంగాణ అసాధారణ గెజిట్‌లో ప్రచురించాలని ప్రభుత్వం ఆదేశించింది.

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు**

నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియామకానికి సహకరించిన రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కి నూతనంగా నియమితులైన పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయడం ప్రధాన లక్ష్యాలుగా నూతన పాలకవర్గం పనిచేయనుంది.



## ఎరువుల దుకాణాల తనిఖీ

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** నూతనకల్ మండల కేంద్రంలోని వివిధ ఎరువుల దుకాణాలను తుంగతుర్తి ఏడిఏ రమేష్ బాబు, మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. డీలర్లు రిజిస్టర్లను క్రమం తప్పకుండా రాయాలని, స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకు అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను డీలర్లు తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో ఏఈఓ సాయిప్రసాద్ డీలర్లు మొరిగాల కిరణ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

### టీఆర్ఎస్ రాష్ట్ర నేత సయ్యద్ ఇస్మాయిల్





**నూతనకల్( క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్టం కలను స్వప్మించి ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివి అని వారి స్పూర్తి తో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తాం అని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, తుంగతుర్తి నియోజవర్గం ఇంచార్జి సూరారపు కృష్ణవేణి అన్నారు,గురువారం మండల కేంద్రం లో టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించారు ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా లో పార్టీ జెండాను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత మ్మ ఆదేశాను సారం తుంగతుర్తి నియోజవర్గం లో పాంచజన్యం సంకల్ప సభలు, సామాజిక న్యాయ సమావేశాలు ఊరూర నిర్వహిస్తామని చెప్పారు ఈ కార్యక్రమం లో టీఆర్ఎస్ నియోజకవర్గం నేతలు పిట్టల మహేష్, చిరంజీవి, ధారావత్ ప్రవీణ్ నాయక్ రేణుక, వంశీ, సంపత్ జిల్లా, నియోజక మండలనాయకులు పాల్గొన్నారు,

## రాహుల్ గాంధీపై దాడికి నిరసనగా కాంగ్రెస్ నాయకుల ధర్నా



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతి యుతంగా నిరసన చేపట్టిన లోక్ సభ ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీ లపై ఢిల్లి పోలీసులు దాడి చేయటాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బ్లాక్ డే ధర్నా ,నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు కట్ట మల్లారెడ్డి,మాజి మండల పార్టీ అద్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసి ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్న మోడీ, అమిత్ షా లను గద్దె దించేవరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.13 కోట్ల నిరుపేదల ఓట్లను తిరిగి చేర్చాలని , సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ దేశ ప్రజల గొంతుకై నిలబడుతున్నారని అందుకే కుట్రతో భాజపా పోలీసులతో దాడి చేస్తుందని వారు చేస్తున్న తప్పులకు మూల్యం చెల్లించే తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు అనంతుల శ్రీనివాస్, గుగులోతు కృష్ణా నాయక్,లావుడ్యా జ్యోతి సుధాకర్, యువజన కాంగ్రెస్ అద్యక్షులు పసుల అశోక్ యాదవ్, మండల కాంగ్రెస్ నాయకులు నకెరకంటి వెంకన్న,జహంగీర్, ఇమ్మరెడ్డి మహేష్ రెడ్డి,లింగాల రామచంద్రయ్య,చురకంటి చంద్రారెడ్డి,పసుల వెంకన్న,అనంతుల నాగలింగం,జటంగి గణేష్,నకిరకంటి మధు,వీరబొయిన లింగయ్య, ఇరుగు కిరణ్,మూడ్ శంకర్ నాయక్,దేశపంగు యల్లయ్య,మడ్డి లింగయ్య, బయ్య గంగయ్య, ఏలిమినేటి కృష్ణా ప్రశాంత్, దేశపంగు మురళి, మరికంటి అశోక్, బొల్లేపల్లి సాయి, బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి సింగరేణి స్కూల్‌లో ‘పౌష్టిక అల్పాహార’ కార్యక్రమం ప్రారంభం

### విద్యార్థులకు స్వయంగా టిఫిన్ వడ్డించిన ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ

### పాఠశాల పరిసరాలు, కూరగాయల తోటల పరిశీలన



**మందమర్రి, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘పౌష్టిక అల్పాహార’ కార్యక్రమాన్ని గురువారం మందమర్రిలోని సింగరేణి హైస్కూల్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ రేపటి పౌరులైన విద్యార్థుల ఆరోగ్యం, చదువును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ పౌష్టిక అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ఉదయాన్నే పౌష్టికాహారం అందడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. మన ప్రాంతంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మోడర్న్ కిచెన్ ప్రారంభోత్సవం రోజే, అక్కడి నుంచి మన సింగరేణి స్కూల్ పిల్లలకు కూడా అల్పాహారం అందించాలని కోరామని, ఈ రోజు నుండి మన పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన బ్రేక్‌ఫాస్ట్ అందడం సంతోషంగా ఉందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మోడర్న్ కిచెన్ సెంటర్ల నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం తమ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద రూ. 50 కోట్ల నిధులను (7, 8 మోడర్న్ కిచెన్ సెంటర్లకు) కేటాయించిందని తెలిపారు. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లాలోని మోడర్న్ కిచెన్ సెంటర్‌కు రూ. 7.5 కోట్లు అందించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి సాంకేతికతతో, అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో ‘హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్’ నిపుణులైన వంటగాళ్ల ద్వారా ఈ ఆహారాన్ని సిద్ధం చేస్తున్నారని ప్రశంసించారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు సీఎస్ఆర్ నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.

**బడి ఆవరణ పరిశీలన**

అనంతరం జీఎం స్కూల్ పరిసరాలను, పాఠశాల సిబ్బంది పెంచుతున్న కూరగాయలు, పండ్ల మొక్కలను పరిశీలించారు. మొక్కలను కోతులు పాడుచేయకుండా చుట్టూ ప్రొటెక్షన్ మెష్ ఏర్పాటు చేయాలని ఫారెస్ట్ అధికారి నవీన్, సివిల్ అధికారి మదీనా బాషాలను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. పురుషోత్తం, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుక లారీలను తాత్కాలికంగా నిలిపివేయాలి



**క్రైమ్ మిర్రర్,మంగపేట:** తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండుగైన దసరా నవరాత్రులు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభంకానున్న సందర్భంగా ఇసుక లారీలను తాత్కాలికంగా నిలిపివేయాలని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ సంబంధిత అధికారులను ప్రకటనలో కోరారు.పాఠశాలలు,కళాశాలలకు సెలవులు ఉండటంతో పాటు ప్రజలు కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు వివిధ ప్రాంతాలకు దూర ప్రయాణాలు చేసే అవకాశం ఉండటంతో రహదారులపై రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రమాదాలు జరగకుండా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఇసుక లారీలను నిలిపివేసి ప్రజల ఇబ్బందులు, ప్రయాణికుల భద్రత విలువైన ప్రాణాలను పరిగణనలోకి తీసుకొని సంబంధిత జిల్లా మరియు మండల అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.పండుగ పూర్తి అయ్యే వరకు ప్రజలకు సురక్షిత ప్రయాణ వాతావరణాన్ని కల్పించాలని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ తరఫున అధికారులకు విజ్ఞప్తి చేశారు.



## కిసాన్ మోర్చా జిల్లా మీడియా కన్వీనర్‌గా ఇరువేంటి వెంకటేశ్వరచారి

### నియామక పత్రం అందజేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా కిసాన్ మోర్చా మీడియా కన్వీనర్‌గా ఇరువేంటి వెంకటేశ్వరచారిని నియమించారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నారాయణ చంద్రారెడ్డి అధ్యక్షతన, తల్లోజు ఆచారి, పోతుగంటి భరత్ ప్రసాద్ సమక్షంలో ఈ నియామక కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ చేతుల మీదుగా ఇరువేంటి వెంకటేశ్వరచారికి కిసాన్ మోర్చా జిల్లా మీడియా కన్వీనర్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, రైతు సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కిసాన్ మోర్చా మీడియా విభాగం కీలకంగా పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు, వివిధ మండలాల సభ్యులు, చారకొండ మండల అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానందనగర్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

### బస్సులు, ఆటోల కోసం ప్రత్యేక నిలుపుదల ప్రాంతం ఏర్పాటు

### ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



**కూకట్‌పల్లి, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ అరెకపూడి గాంధీ తెలిపారు. వివేకానందనగర్ ప్రధాన రహదారి నుంచి సర్వీస్ రోడ్డును ఎమ్మెల్యే అరికపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నిలిచేలా ప్రత్యేక బస్సు నిలుపుదల ప్రాంతాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన మేరకు రహదారి విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అదేవిధంగా వివేకానందనగర్ కాలనీ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద బస్సులు, ఆటోలు నిలిచిపోకుండా కొంత ముందుభాగంలోనే వాటి నిలుపుదల ప్రాంతాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. దీంతో కాలనీ ప్రధాన ప్రవేశం వద్ద వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడవచ్చని తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంతో పాటు వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి రాజీ లేకుండా కృషి చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి, కమిటీ సభ్యులు జి. నర్సింగ్‌రావు, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, జి. ప్రసాద్, సి.కె. రెడ్డి, కె.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదు

### నాంపల్లి లో సి ఇ సి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

### రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులను ఖండించిన కాంగ్రెస్



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిని నిరసిస్తూ, ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నాంపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి మండల కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో భారీగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, పలువురు సీనియర్ నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టులను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకులపై నిర్బంధ చర్యలు చేపట్టడం సరికాదని వారు అన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ సి ఇ సి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కొనసాగిస్తూ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి -- "ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయాలి! ఓటు హక్కు మా హక్కు -- ప్రజాస్వామ్యం మా హక్కు!, ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలి!"

- ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత తీసుకురావాలి!
- ప్రజల ఓటు -- ప్రజల హక్కు!..
- "ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం -- కాంగ్రెస్ పోరాటం!..
- ఓటరు హక్కులకు రక్షణ కల్పించాలి!...
- "ప్రజల నమ్మకాన్ని కాపాడాలి -- ఎన్నికల వ్యవస్థను కాపాడాలి!...
- అంటూ నినాదాలు చేస్తూ ఆందోళనను ఉధృతం చేశారు.
- ఈ సందర్భంగా, నాంపల్లి మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కును - ఇది ప్రజల హక్కు అని, "ఓటరు హక్కులకు రక్షణ కల్పించాలి!.., "ప్రజల నమ్మకాన్ని కాపాడాలి -- ఎన్నికల వ్యవస్థను కాపాడాలి!"లి అని అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా ప్రజల హక్కుల కోసం ఎంత వరకు అయినా పోరాడుతమన్నారు... ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని అన్నారు. ప్రజల గొంతుకను అణిచివేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కమిటీ మెంబెర్స్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యదర్శులు, ఎక్స్ క్యూటివ్ మెంబెర్స్, మాల్ మార్కెట్, డైరెక్టర్ లు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.... నిరసన సందర్భంగా కొంతసేపు అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు....

# పైప్‌లైన్ పనులు పూర్తి.. శనివారం నుంచి నీళ్లు

**నేడు ట్రయల్ రన్.. అన్ని వార్డులకు సరఫరా: కమిషనర్ మురళీకృష్ణ**



**రామకృష్ణాపూర్ అక్టోబర్ 8 (క్రైమ్ మిర్రర్):** రోడ్డు విస్తరణ పనుల కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన మంచినీటి సరఫరాను శనివారం నుంచి యథావిధిగా పునరుద్ధరించనున్నట్లు కమిషనర్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆర్‌ఓబీ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ప్రధాన తాగునీటి పైప్‌లైన్లను పక్కకు మార్చారు. దీంతో ఆర్‌కే-4 గడ్డ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా 3--4 ట్యాంకర్ల ద్వారా అవసరమైన ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. పైప్‌లైన్ మార్పిడి పనులు పూర్తయ్యాయని, శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించి లీకేజీలు, ఇతర సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే సరిచేస్తామని కమిషనర్ తెలిపారు. శనివారం నుంచి మిషన్ భగీరథ ద్వారా పట్టణంలోని అన్ని వార్డులకు గతంలో మాదిరిగానే మంచినీటి సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# బాలానగర్‌లో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు

**పర్యవేక్షిస్తున్న బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**

**బాలానగర్, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** ఎంగిలిపూల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బాలానగర్ డివిజన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమం నుంచి ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ డివిజన్‌లో బతుకమ్మ సంబరాలను గత 19 సంవత్సరాల నుండి ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ ఏడాది కూడా మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆవుల రవీందర్ రెడ్డి ఆకాంక్షించారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఖాజా, దేవులపల్లి కృష్ణమూర్తి, మహిళా అధ్యక్షురాలు కవిత, సుధా రెడ్డి, శ్రీలత, దేవేందర్ రెడ్డి, రంగంపేట శ్రీనివాస్ ముదిరాజ్, ప్రేమ్ కుమార్, మురళీధర్, అభిమన్యు తదితర నాయకులు పాల్గొని బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# కోకాపేట్‌లో వ్యర్థాల వేర్పాటుపై వ్యాపారస్తులకు అవగాహన

**నో బిన్ -- నో ట్రేడ్ పై అవగాహన కల్పించిన అధికారులు**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని వార్డు నం.125, కోకాపేట్‌లో వ్యర్థాల వేర్పాటుపై వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్వహిం చాల్సిన అవసరాన్ని అధికారు లు వివరించారు. ఈ సంద ర్భంగా "నో బిన్ -- నో ట్రేడ్" అంశంపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి వ్యాపార సంస్థలో తడి చెత్త, పొడి చెత్త కోసం రెండు ప్రత్యేక చెత్త బిన్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెత్తను మూలస్థాయిలోనే వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో వ్యాపారస్తుల సహకారం ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. వ్యర్థాలను రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి వేర్వేరుగా అందించాలని సూచించారు. వ్యర్థాల వేర్పాటును ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటిస్తే కోకాపేట్‌ను పరిశుభ్రంగా ఉంచవచ్చని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని నార్సింగి సర్కిల్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# క్షయ వ్యాధి రహిత గ్రామ పంచాయతీగా గుండ్రపల్లి




చండూరు, క్రైమ్ మిర్రర్: క్షయ వ్యాధి రహిత గ్రామ పంచాయతీగా గుండ్రపల్లి గ్రామం ఎంపిక కావడం గురువారం నల్గొండ కలెక్టరేట్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవనంలో కలెక్టర్ బుడుగు చంద్రశేఖర్ చేతుల మీదగా ప్రశంసా పత్రం తీసుకున్నారు గ్రామ సర్పంచ్ ఉజ్జిని ఉష అనిల్ రావు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తగిన కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తూ పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న సందర్భంగా పలువురు గ్రామస్తులు సర్పంచ్ దంపతులకు అభినందనలు తెలిపారు.

# డ్రీమ్ వ్యూ కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

**ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత**

**టీపీసీసీ వైస్-ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**



**కూకట్‌పల్లి, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, వసంత నగర్ డివిజన్ లోని డ్రీమ్ వ్యూ కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యను కాలనీవాసులు టీపీసీసీ వైస్-ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసుల సమస్యను పరిష్కరించేందుకు బండి రమేష్ సంబంధిత అధికారులతో మాట్లాడి, డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా గురువారం డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండి రమేష్ హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని, కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యను అధికారుల సహకారంతో పరిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కిల్లారు శ్రీనివాస బాబు, కాలనీ ప్రెసిడెంట్ తాకినేని రవికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాకినేని వినోద్ కుమార్, రామారావు, కోటారి వెంకట్, కొల్లి సత్యనారాయణ, సురేష్, రాంబాబు, రాజు, వెంకటేష్, జానారెడ్డి, చక్రధర్, అలాగే కాలనీవాసులు చలపతి, రాజు, రవీంద్ర, వర్మ, చందు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జీహెచ్‌ఎంసీ అధికారులు, డీజీఎం త్రినాథరావు, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ మమత తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించినందుకు కాలనీవాసులు బండి రమేష్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రమాదంలో గాయపడిన బీజేపీ సీనియర్ కార్యకర్త రామారావుకు పరామర్శ

**ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఇటీవల తొండుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ కార్యకర్త పాత్లవత్ రామారావును బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ పరామర్శించారు. రామారావు నివాసానికి పార్టీ నాయకులతో కలిసి వెళ్లిన ఆయన, కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం అనంతరం రామారావు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు నాయకులు తెలిపారు. అత్యవసర చికిత్స అనంతరం ఆరోగ్యం మెరుగుపడటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్ భూపాల్ గౌడ్ రామారావుతో మాట్లాడి ఆయన కోలుకుంటున్న తీరును తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందని, అవసరమైన సమయంలో పార్టీ తరఫున సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్. మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి పి. మల్లేష్ యాదవ్, జిల్లా ఆఫీస్ సెక్రటరీ ఎస్. విజయ్ కుమార్, జిల్లా ఐటీ సెల్ నాయకుడు వెంకటరమణ గుప్తా, జిల్లా ఓబీసీ కార్యదర్శి ఎన్. జగన్, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు బుర్ర అభినయ్ గౌడ్, సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నవజీవన్ నగర్‌లో సమస్యపై అధికారుల తక్షణ స్పందన

**వాటర్ మ్యాన్‌హోల్‌పై నిర్మించిన రిటైనింగ్ వాల్ తొలగింపునకు హామీ**



**బాలానగర్, అక్టోబర్ 08 (క్రైమ్ మీర్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించారు. కాలనీలోని వాటర్ మ్యాన్‌హోల్‌పై నిర్మించిన రిటైనింగ్ వాల్ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్న విషయాన్ని కాలనీ వాసులు వాటర్ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదుపై స్పందించిన వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. మ్యాన్‌హోల్‌పై నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని, ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించి కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కాలనీ సమస్యను అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కారానికి హామీ ఇవ్వడంపై నవజీవన్ నగర్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యపై స్పందించిన వాటర్ డిపార్ట్‌మెంట్ డీజీఎం శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములులకు కాలనీ వాసుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ జనరల్ సెక్రటరీ ఆర్.కె. రాజు పటేల్, మాజీ అధ్యక్షులు రమేష్ నాయుడు, అరుణ్, అలాగే కృష్ణ, సురేష్ సింగానియా, కవిత, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. "ప్రజల సమస్యలను అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కరించాలి. నవజీవన్ నగర్ కాలనీ సమస్యపై స్పందించిన అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు" అని కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# కేపీహెచ్‌బీలో అనుటెక్స్‌లో సందడి చేసిన నిధి అగర్వాల్

**నిధి అగర్వాల్ చేతుల మీదుగా ప్రారంభం..ఆకట్టుకునే ప్రారంభ ఆఫర్లు**





**కూకట్ పల్లి, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** కుటుంబ ఫ్యాషన్ విభాగంలో విశ్వసనీయ బ్రాండ్‌గా పేరొందిన అనుటెక్స్ కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1లో నూతన షోరూంను ఘనంగా ప్రారంభించింది. సినీ నటి నిధి అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. 1970లో ప్రారంభమైన అనుటెక్స్ ఐదు దశాబ్దాలకు పైగా నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలకు ప్రాధాన్యమిస్తూ వినియోగదారుల ఆదరణ పొందుతోంది. కుటుంబంలోని ప్రతి ఒక్కరి అవసరాలకు అనుగుణంగా సంప్రదాయ దుస్తులు, పండుగల కలెక్షన్స్, రోజువారీ వస్త్రాలు తదితర విభాగాల్లో విస్తృత శ్రేణి దుస్తులను అందుబాటులో ఉంచినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం అనుటెక్స్ కూకట్ పల్లి పరిధిలోని కేపీహెచ్‌బీతో పాటు కొత్తపేట, అల్వాల్, మల్కాజిగిరి, ఉప్పల్, ఏఎస్ రావు నగర్, ఆర్‌సీ పురం, సుచిత్ర ప్రాంతాల్లో షోరూంలను నిర్వహిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

**ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లు**

- ఒక చీర కొనుగోలు చేస్తే అదే ధర గల మరో చీర కేవలం రూ. 1కే
- రూ. 4,999 విలువైన కొనుగోలుపై ఉచిత వెండి నాణెం.
- రూ. 7,999 విలువైన కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం
- రూ. 1,499కు పైగా కొనుగోలుపై ఉచిత బహుమతులు.

కష్టమర్ల నుంచి గత 56 ఏళ్లుగా అందుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపిన అనుటెక్స్ యాజమాన్యం, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1లోని నూతన షోరూంను సందర్శించి ప్రారంభోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరింది. శ్రీనివాస్, నాగేష్, రాజశేఖర్ మాట్లాడుతూ అనుటెక్స్ మరింత విస్తరణ దిశగా ముందుకు సాగుతోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.



## ఘనంగా గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు**

**కూకట్ పల్లి, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి బిజెపి సీనియర్ నాయకులు గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు శుక్రవారం కొండాపూర్ లో రెడ్సన్ హోటల్లో ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి, రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు మధ్య గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యోగానంద మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలు మధ్య చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నామాల శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, పలువురు సీనియర్ కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నప్రేమ కరువైంది.. బాలానగర్‌లో నవజాత శిశువు రోడ్డుపాలు..!

**పసికందును రోడ్డు పాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం...ఏసీపీ నరేష్ రెడ్డి**






**బాలానగర్, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** కని పెంచాల్సిన పేగు బంధమే తెగిపోయిందో.. లేక వెంటాడిన కఠిన పరిస్థితులే లొంగదీసుకున్నాయో గానీ, అప్పుడే కన్నుతెరిచిన నవజాత మగ శిశువును రోడ్డుపై పడేసిన అమానుష ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది. స్థానికుల అప్రమత్తత.. పునర్జన్మ పొందిన పసికందు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాలానగర్ వైన్స్ సమీపంలో ఓ కండువాలో చుట్టి ఉన్న పసికందు రోదిస్తూ ఆ దారిన వెళ్తున్న కొందరు స్థానిక యువకులకు కనిపించింది. నిశ్శబ్ద వాతావరణంలో చిన్నారి ఏడుపు విని దగ్గరకు వెళ్లిన ఆ యువకులు, దృశ్యాన్ని చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వేళపాళ లేని వేళ, ఏమాత్రం కాలయాపన చేయకుండా వెంటనే బాలానగర్ పోలీసులకు సమాచారం అందించారు.

**సకాలంలో వైద్యం.. ప్రాణాపాయం తప్పిన చిన్నారి**

సమాచారం అందుకున్న వెంటనే బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, డీఐ సక్రమ్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు, శిశువును తక్షణమే బాలానగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చిన్నారికి అత్యవసర చికిత్స అందించి, నిరంతర పరిశీలనలో ఉంచారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని, ప్రస్తుతం పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందో లేదో వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

**రంగంలోకి పోలీసులు.. సీసీటీవీల పరిశీలన**

పోలీసుల సహకారంతో వైద్యులు శిశువుని అమీర్పేట్ లోని శిశు విహార కు తరలించారు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. బాలానగర్ ప్రధాన రహదారిలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శిశువును వదిలివెళ్లిన కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నవారు ఎవరు, ఈ నిర్దయ చర్యకు వెనుక ఉన్న కారణాలేమిటనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పసికందును రోడ్డుపాలు చేసిన బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ నరేష్ రెడ్డి స్పష్టం చేశారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మంగళపల్లి నరసింహ సతీమణికి పరామర్శ



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కడ్తాల్ మండలానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మంగళపల్లి నరసింహ సతీమణి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ గురువారం ఆమెను పరామర్శించారు. కాళ్లు, చేతులు పడిపోవడంతో మంచానికే పరిమితమైన బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని జర్పుల దశరథ్ నాయక్ అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ తదితరులు పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓగా డాక్టర్ కె. కళ్యాణ్ చక్రవర్తి బాధ్యతల స్వీకరణ



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ)గా డాక్టర్ కె. కళ్యాణ్ చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జిల్లా క్షయ నివారణాధికారిగా (డీటీసీఓ) విధులు నిర్వహిస్తున్న ఆయనకు తదుపరి ఉత్త ర్వులు వెలువడే వరకు డీఎంహెచ్‌ఓగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ పాపారావు, జిల్లా పరిపాలనాధికారి షఫీ, ప్రోగ్రాం అధికారి అక్రమ్, డాక్టర్ రాకేష్‌తో పాటు జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది డాక్టర్ కె. కళ్యాణ్ చక్రవర్తిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## గవర్నమెంట్ ఇచ్చిన ట్రాన్స్ఫార్మర్ గవర్నమెంట్ భూమీ లో వేశాము

**మహమ్మదాబాద్ గ్రామ ప్రజల కోసం కంపెనీల కోసం కాదు**



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం మహమ్మదాబాద్ గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిలో విద్యుత్ మరమతులను ఆపాలని గురువారం పేపర్లో వచ్చిన సమాచారం బాధాకరం ఎందుకనగా గవర్నమెంట్ ఇచ్చిన ట్రాన్స్ఫార్మర్ గవర్నమెంట్ భూమీ లో వేయడం జరిగింది కేవలం వ్యవసాయ సాగు కొరకు మాత్రమే కానీ ఎటువంటి ఇండస్ట్రియల్ కంపెనీల కోసం కాదు ఇది అందరూ గమనించాలి దయచేసి అన్ని విషయాలను గ్రామ పరువును పబ్లిసిటీ చేయటం ఎంతవరకు కరెక్ట్, దయచేసి ఇటువంటి విషయాలను పబ్లిసిటీ చేయటం మానుకోండి. ఈ గ్రామంలో ఇదే విధంగా అభివృద్ధిని అడ్డుకొని శాంతిభద్రతలు లేకుండా చేయడం బాధాకరం, మనము భావితరాలకు ఇచ్చే సూచనలు ఇవేనా, అందరూ అర్థం చేసుకోండి, లేదంటే ప్రభుత్వము కఠిన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది తెలిపారు.




## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 'చలో లోక్ భవన్'..

**కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.. కాంగ్రెస్ నాయకులు పట్వారి శశిధర్**

**కూకట్ పల్లి, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** ప్రజాస్వామ్య విలువలను, ఓటు హక్కును పరిరక్షించాలనే డిమాండ్‌తో నెక్లెస్ రోడ్ వద్ద నిర్వహించిన 'చలో లోక్ భవన్' కార్యక్రమంలో "తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్" మెట్టు సాయి కుమార్ తో కలిసి "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్ పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, సర్ ప్రక్రియలో అవకతవకలను నిరసనగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణేతలని, వారి ఓటు హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపరచకూడదని స్పష్టం చేశారు. ఓటు హక్కు రక్షణే ప్రజాస్వామ్య రక్షణ.. ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది" అనే నినాదంతో నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని పట్వారీ శశిధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, మహిళ నాయకులు, యూత్ కాంగ్రెస్, సేవాదళ్, యువకులు, కార్యకర్తలు టీం పట్వారీ, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒగ్గు బీర్ల కళాకారుల కమిటీ ఏర్పాటు..

**నూతన కార్యవర్గానికి పాపిశెట్టిరాము అభినందనలు**



**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి):** కల్వకుర్తి నియోజకవర్గ ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం గురువారం ఆమనగల్లు పట్టణంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేశారు. నియోజకవర్గం అధ్యక్షుడిగా బిర్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా చిందాం వెంకటేష్ ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కల్వకుర్తి,వెల్దండ మండలాల అధ్యక్షుడిగా వస్పరి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాచూరు యాదయ్య, ఆమనగల్లు,మాడ్గుల మండలాల అధ్యక్షుడిగా పెంద్యాల మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షుడిగా పడకల్ శివ, ఉపాధ్యక్షుడిగా పట్నం రామాంజనేయులు ను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము హాజరై నూతన కార్యవర్గాన్ని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కళాకారుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సంఘం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యుడు శ్రీను నాయక్, బన్నె శివ, వెంకటయ్య, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల 'చోరీ'పై ధర్నాకు సంఘీభావం

**మంత్రి వివేక్ వెంకటస్వామి ధర్నాకు గుర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 మంది కార్యకర్తల మద్దతు**

**మందమర్రి అక్టోబర్ 8 (క్రైమ్ మిర్రర్):** ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఓటర్ల జాబితాలో అక్రమాలకు వ్యతిరేకంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలో నిర్వహించిన ధర్నాకు గద్దెరాగడి 7వ వార్డు కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. సుమారు 100 మంది కార్యకర్తలతో కలిసి మందమర్రికి చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఓటు హక్కును పరిరక్షించాల్సిన అవసరాన్ని వివరిస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టే పోరాటానికి తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గుర్రం శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ 'పోరు'

### కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా మందమర్రిలో నిరసన

### సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి డిమాండ్

**మందమర్రి, అక్టోబర్ 8 (క్రైమ్ మిర్రర్):** ఓట్ల తొలగింపు చర్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మందమర్రి పాత బస్టాండ్ జాతీయ రహదారిపై నిరసన వెల్లువెత్తింది. రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో పౌరులకు ఓటు హక్కు అత్యంత కీలకమైందని, దాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. ఓట్ల చోరీపై మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టు పిరికిపంద చర్య అని మండిపడ్డారు. ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ అరెస్టు చేసుకుంటూ పోతే దేశంలో ఎంతమందిని బంధిస్తారని నిలదీశారు. ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే చర్యలను సహించేది లేదని, ఇందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన




ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ అధ్యక్షులు, నాయకులు, కాంగ్రెస్ మహిళా, యువజన విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై 'పోస్టుకార్డు పోరు'

### హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

### పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదు - టియూడబ్ల్యూజే (హెచ్ -143).

### జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం పై ఆగ్రహం వ్యక్తం చేసిన జర్నలిస్ట్ లు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కోన్ని ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్ట్ ల హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, ఇతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో జర్నలిస్టుల ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా కోశాధికారి పి. వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం. అంజిలప్ప లు అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి కాలయాపన చేయడం ఏమాత్రం సరైనది కాదన్నారు. గురువారం శంషాబాద్ లోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి కి పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. టీయూడబ్ల్యూజే రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఏ.కృష్ణ గౌడ్, టి.వెంకటయ్యల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ పోస్టుకార్డు ఉద్యమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ...జర్నలిస్టుల సమస్యలను



పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతోమంది జర్నలిస్టులు జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కార్డు లేకపోవడం వల్ల అనారోగ్యాలకు గురవడమే కాకుండా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబించడం ఏమాత్రం సరైనది కాదన్నారు. జర్నలిస్టుల సంక్షేమం మాటల్లోకాదు...చేతల్లో చూపించాలన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు ఇవ్వాలని టి యు డబ్ల్యూ జే ఆధ్వర్యంలో గత వారం రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టు కార్డు ద్వారా లేఖలు పంపించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఏ.కృష్ణ గౌడ్, టి.వెంకటయ్యలు

మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల సమస్యలనే ప్రభుత్వంపట్టించుకోకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి ఇకనైనా కళ్లు తెరవాలని కోరారు. జర్నలిస్టులకు అతి ప్రధానమైన హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, గౌరవ వేతనాలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల కోసం జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని, రెండో విడత అక్రిడిటేషన్ కార్డులను కూడా వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను సాగదీస్తూ జర్నలిస్టుల సహనాన్ని పరీక్షించవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శంషాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మసూద్ అలీ ఖాన్, చంద్రకుమార్ లు మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోతే రాబోయేరోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జె (హెచ్-143) యూనియన్ నాయకులు సంజయ్, కే.నరసింహ, మధు, గౌస్,ఆర్.నాగేష్, గణేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

----



# బాధ్యత చిన్నదైనా.. లక్ష్యం పెద్దది బీజేపీ బలోపేతమే రాజుస్వామి ధ్యేయం

### ఎండోమెంట్ విభాగం కన్వీనర్‌గా అవకాశం..

### పార్టీ నమ్మకాన్ని నిలబెడతా: కలిశెట్టి రాజుస్వామి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎండోమెంట్ అసెంబ్లీ కన్వీనర్‌గా తనకు అవకాశం కల్పించిన పార్టీ అధిష్ఠానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అంకితభావంతో పనిచేస్తానని కలిశెట్టి రాజుస్వామి అన్నారు. గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ గారితో పాటు సీనియర్ నాయకులని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజుస్వామి మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. ఎండోమెంట్ విభాగానికి సంబంధించిన అంశాలతో పాటు ప్రజా సమస్యలపై పార్టీ తరఫున చురుగ్గా పనిచేస్తానన్నారు. పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్తను కలుపుకొని ఐక్యంగా పనిచేస్తే క్షేత్రస్థాయిలో బీజేపీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు నాయకత్వం అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని రాజుస్వామి స్పష్టం చేశారు.

# హిమాయత్‌సాగర్ ఎకో పార్క్‌లో స్నేక్ అవేర్‌నెస్ కార్యక్రమం

### వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా నిర్వహణ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని హిమాయత్‌సాగర్ ఎకో పార్క్‌లో గురువారం స్నేక్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాములపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వాటి ప్రవర్తన, పర్యావరణ ప్రాధాన్యత, సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా ఉంది. కార్యక్రమంలో వివిధ రకాల పాముల గురించి సందర్శకులకు వివరించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో పాములు పోషించే కీలక పాత్ర, ప్రకృతి ఆహార గొలుసులో వాటి ప్రాధాన్యతను తెలియజేశారు. పాములు కనిపించినప్పుడు ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వాటిని చంపకుండా సురక్షితంగా సంరక్షించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై అవగాహన కల్పించారు. పాములను చూసిన వెంటనే భయాందోళనలకు గురికాకుండా, వాటికి దూరంగా ఉంటూ నిపుణులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని నిర్వాహకులు సూచించారు. వన్యప్రాణులను సంరక్షించడం ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడటంతో పాటు సహజ పర్యావరణ సమతుల్యతను కొనసాగించవచ్చని తెలిపారు. మనిషి--వన్యప్రాణుల మధ్య సామరస్యపూర్వక సహజీవనం ఎంతో అవసరమని, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. స్నేక్ అవేర్‌నెస్ కార్యక్రమానికి ఎకో పార్క్ సందర్శకుల నుంచి మంచి స్పందన లభించింది. అవగాహన, జ్ఞానం ద్వారానే మనుషులు--వన్యప్రాణుల మధ్య సురక్షితమైన, సామరస్యపూర్వక సహజీవనం సాధ్యమవుతుందని కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు.



# బాలానగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### స్కూటీపై ఐరన్ పైపుల లోడ్ పడి వ్యక్తి మృతి

**బాలానగర్, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్):** బాలానగర్ ఎక్స్ రోడ్డు పరిధిలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బాలానగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం ఐరన్ పైపులను తరలిస్తున్న వాహనం నుంచి లోడ్ అదుపుతప్పి స్కూటీపై పడటంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. స్కూటీపై వెళ్తున్న వ్యక్తిపై ఒక్కసారిగా భారీ ఐరన్ పైపులు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం తీవ్రతకు ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో బాలానగర్ ఎక్స్ రోడ్డు పరిసరాల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టినట్లు సమాచారం. భారీ ఇనుప పైపులను సరైన భద్రతా చర్యలు లేకుండా తరలించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా? లోడ్ రవాణా సమయంలో నిబంధనలు పాటించారా? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై భారీ సామగ్రిని తరలించే వాహనాల విషయంలో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతుడి గుర్తింపు, ప్రమాదానికి కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది. భారీ లోడ్ల రవాణాలో నిర్లక్ష్యం.. అమాయకుల ప్రాణాలకు ముప్పు! బాలానగర్ ప్రాంతంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కిసాన్ మోర్చాలో వెంకటేశ్వరచారికి కీలక బాధ్యతలు

### జిల్లా మీడియా కన్వీనర్‌గా నియామకం.. నియామక పత్రం అందజేత



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా కిసాన్ మోర్చా మీడియా కన్వీనర్‌గా ఇరువేంటి వెంకటేశ్వరచారిని నియమించారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నారాయణ చంద్రారెడ్డి అధ్యక్షతన, తల్లోజు ఆచారి, పోతుగంటి భరత్ ప్రసాద్, చారకొండ మండల అధ్యక్షుడు కృష్ణ సమక్షంలో నియామక కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ చేతుల మీదుగా వెంకటేశ్వరచారికి కిసాన్ మోర్చా జిల్లా మీడియా కన్వీనర్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ, కిసాన్ మోర్చా కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో చురుకైన పాత్ర పోషించాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కిసాన్ మోర్చా నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగిలో అధికారులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమీక్ష

### పెండింగ్ అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, ప్రజా సమస్యలపై చర్చ





గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ నార్సింగి సర్కిల్-45 కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతి, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నార్సింగి పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు వివరాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సమావేశంలో డీసీ లక్ష్మారెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# నార్సింగి సర్కిల్‌లో ఎస్‌ఎన్‌డీపీ పనులపై ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్ పరిశీలన

### పందేన్‌వాగు నాలా పనులు, ట్రైల్స్ విల్లాస్ వద్ద నాలా పనుల తనిఖీ

గండిపేట(క్రైమ్ మిర్రర్): శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి తో కలిసి నార్సింగి సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పందేన్‌వాగు నాలా వద్ద కొనసాగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనులతో పాటు ట్రైల్స్ విల్లాస్ వద్ద నాలా పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో చర్చించారు.



అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నార్సింగి సర్కిల్ కార్యాలయంలో సంబంధిత సెక్షన్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొనసాగుతున్న పనుల పురోగతి, ప్రధాన సమస్యలు, పనుల పూర్తికి అవసరమైన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని అధికారులు సూచించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా నార్సింగి సర్కిల్ పరిధిలో మెరుగైన పౌర మౌలిక వసతులు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 శుక్రవారం 9-10-2026


# తాగునీటి కొరత రాకుండా ఇప్పటి నుంచే పొదుపు చేయాలి

## నీటి వినియోగాన్ని 25 శాతం తగ్గించాలి

### జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రానున్న రోజుల్లో తాగునీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు, ది సిటిజన్స్ కౌన్సిల్ వ్యవస్థాపక చైర్మన్ సీతారాం ధూళిపాల ఆధ్వర్యంలో తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు జలమండలి ఎండీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీటి సరఫరా, నీటి సంరక్షణ, యూజీడీ, ఎస్టీపీల బలోపేతం తదితర అంశాలపై ప్రతినిధులు చర్చించారు. రాష్ట్రంలో నీటి కొరత, వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. దీనిపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి స్పందిస్తూ డిసెంబర్ 15వ తేదీ నుంచి సింగూర్, మంజీరా రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రజలు తమ సాధారణ నీటి వినియోగాన్ని కనీసం 25 శాతం తగ్గించి పొదుపుగా వినియోగించాలని సూచించారు. ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లతో పాటు ప్రజల సహకారం ఉంటే తాగునీటి కొరతను అధిగమించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నీటి సరఫరాలో ఉన్న అసమానతలను గుర్తించేందుకు సోర్స్, పైప్‌లైన్లు, ప్రెజర్, బల్క్ కనెక్షన్లు, లీకేజీలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని ప్రతినిధులు కోరారు. అలాగే సాధారణ వినియోగంతో పోలిస్తే కనీసం 20 శాతం నీటిని ఆదా చేసే కుటుంబాలు, సంస్థలు, అపార్ట్‌మెంట్లు, కాలనీలను ప్రోత్సహించేలా అవార్డు పథకాన్ని ప్రారంభించాలని సూచించారు. తరచూ జరుగుతున్న మురుగునీటి ఓవర్‌ఫ్లోలను దృష్టిలో ఉంచుకుని యూజీడీ వ్యవస్థ సామర్థ్యంపై సాంకేతిక ఆడిట్ నిర్వహించి, అవసరమైన ప్రాంతాల్లో పైప్‌లైన్ సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. రోడ్ల నిర్మాణం, విస్తరణ సమయంలోనే వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాలను రీచార్జ్ చేసే బోర్‌హోల్స్, ఇతర రీచార్జ్ నిర్మాణాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, హై-రైజ్ ప్రాజెక్టుల నుంచి శుద్ధి చేయని మురుగునీరు బయటకు వెళ్లకుండా కంట్రోల్ డిశ్చార్జ్ విధానాన్ని అమలు చేయాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ప్రజల నీటి భద్రత, నీటి సంరక్షణ, పట్టణ పారిశుద్ధ్యానికి జలమండలి నిర్మాణాత్మకంగా సహకరించేందుకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. గతంలో మీటర్లు, కొలమానాలు లేకుండా విధించిన నీటి బిల్లులకు సంబంధించి తెలంగాణ హైకోర్టు తీర్పు కోసం వేచి చూడాల్సి ఉందని సీతారాం ధూళిపాల తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు అంజనేయులు, ఆరిఫ్, బద్రీనాథ్, పాతూరి శ్రీనివాస్, బలరాం, సి.ఎస్.ఎన్. శర్మ, మహేష్, అజయ్, ప్రభాకర్‌రెడ్డి, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఐటీలో ఎనర్జీ ఆడిటర్లు, ఎనర్జీ మేనేజర్లకు రిఫ్రెషర్ కోర్సు

### ఇంధన సామర్థ్యం, పొదుపుపై నిపుణుల అవగాహన



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** గండిపేటలోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో ఎనర్జీ ఆడిటర్లు, ఎనర్జీ మేనేజర్ల కోసం రిఫ్రెషర్ కోర్సు వర్క్‌షాప్ నిర్వహించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసీసీఐ) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంధన రంగ నిపుణులు, ఎనర్జీ ఆడిటర్లు, ఎనర్జీ మేనేజర్లు పాల్గొన్నారు. ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం దేశ ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఇతర సంస్థలు ఇంధన సామర్థ్య సాంకేతికతలను వినియోగించడంతో పాటు ఇంధనాన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా నిర్వహణ ఖర్చులతో పాటు పర్యావరణంపై ప్రభావాన్ని కూడా తగ్గించవచ్చని తెలిపారు. ఎంజీఐటీ వైస్ ప్రిన్సిపాల్, సర్టిఫైడ్ ఎనర్జీ ఆడిటర్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎనర్జీ ఆడిట్ ద్వారా సంస్థల్లో ఇంధన వినియోగ విధానాలను విశ్లేషించి, నష్టాలు, సామర్థ్య లోపాలను గుర్తించవచ్చని వివరించారు. ఇంధన నిర్వహణను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ కొలతలు, పర్యవేక్షణ, విశ్లేషణ, అమలు, ధ్రువీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో థర్మల్, ఎలక్ట్రికల్ వ్యవస్థల్లో ఇంధన పొదుపు, ఎనర్జీ ఎఫిషియెన్సీ డేటా అనలిటిక్స్, ఈసిఎస్ బి సి, ఎకో నివాస్ సంహిత, ఐఎస్ఓ 50001, కార్బన్ క్రెడిట్ వాణిజ్య పథకం, ఆర్సీఓ, అదీతి, తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. పవన్ కుమార్, వీరేంద్ర కుమార్, నాగేశ్ కుమార్, ఎం.ఎన్. గిరి, సౌమ్య చింత తదితర నిపుణులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఇంధన సామర్థ్యం, ఎనర్జీ ఆడిటింగ్, సుస్థిర భవనాలు, కార్బన్ మార్కెట్లు, ఇంధన పొదుపుపై తాజా పరిజ్ఞానాన్ని పాల్గొన్నవారు పొందారు.

## మణికొండలో బుల్కాపూర్ నాలా పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### రూ.100 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పరిశీలన



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న బుల్కాపూర్ నాలా అభివృద్ధి, నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు రూ.100 కోట్ల భారీ నిధులతో చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలా పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల కారణంగా స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు నాలా అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డితో పాటు డీఈ, ఏఈ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వట్టినాగులపల్లిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజాప్రభుత్వ ఆధ్వర్యంలో నార్సింగి సర్కిల్ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామ వార్డు కార్యాలయం, గ్రామపంచాయతీ సమీపంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, దుల్చన్ శిపాల్ సింగ్, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ గొల్ల నాగేష్ యాదవ్, గండిపేట్ డివిజన్ అధ్యక్షుడు మన్నె నరేందర్ ముదిరాజ్ సమక్షంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కుమ్మరి శేఖర్, బుడాల అరుణ్ ముదిరాజ్, గోలియా తారా సింగ్, కొండే కృష్ణ యాదవ్, మంగళారం కృష్ణ యాదవ్, గొల్ల సుధాకర్ యాదవ్, మందుమూల లక్ష్మణ్ రెడ్డి, భూసత్తి శ్రీశైలం, మంగలి యాదగిరి, కొండే సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## శివరాంపల్లిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ జోష్ కార్యక్రమం

### టీబీ రహిత గ్రామాలకు ధ్రువపత్రాల అందజేత



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శివరాంపల్లిలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ జోష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కార్యక్రమాన్ని ప్రారంభించగా, డీఎంహెచ్ఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ పాపారావుతో పాటు పలువురు వైద్యులు, సర్పంచులు, సూపర్‌వైజర్లు, ప్రజలు, టీబీ మందులు వినియోగించి కోలుకున్న పేషెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీబీ రహిత గ్రామాలుగా గుర్తించిన గ్రామాలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఆయా గ్రామాల్లో టీబీ కేసులు లేవని నిర్ధారించిన అనంతరం సంబంధిత గ్రామాలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలు టీబీ రహిత గ్రామాలుగా అభివృద్ధి చెందేలా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. టీబీ నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అనుమానిత లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ టీబీ నిర్మూలనలో వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. టీబీ బాధితులు వైద్యుల సూచనల మేరకు మందులను క్రమం తప్పకుండా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ శ్రీనివాస్, డీపీపీయం విల్సన్, రహీం, మధుబాబు, మాధవి తదితరులు పాల్గొన్నారు.



## వట్టినాగులపల్లి గౌని చెరువులోకి బోర్ ద్వారా నీటి విడుదల

### బతుకమ్మ పండుగ నేపథ్యంలో నీటి సదుపాయం కల్పించిన అధికారులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బతుకమ్మ పండుగను దృష్టిలో పెట్టుకుని వట్టినాగులపల్లి గ్రామంలోని గౌని చెరువులో నీటి సదుపాయం కల్పించేందుకు బోర్ ఏర్పాటు చేశారు. ప్రజాపాలన ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సహకారంతో, సీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు బోర్ ఏర్పాటు చేసి చెరువులోకి నీటిని విడుదల చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, దుల్చాన్ శిపాల్ సింగ్, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ గొల్ల నాగేష్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రేఖ యాదగిరి, గండిపేట్ డివిజన్ అధ్యక్షుడు మన్నె నరేందర్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు కుమ్మరి శేఖర్, బుడాల అరుణ్ ముదిరాజ్ సమక్షంలో బోర్‌ను ప్రారంభించి నీటిని చెరువులోకి వదిలారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు చెరువు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ఇబ్బందులు లేకుండా నీటి సదుపాయం కల్పించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. చెరువులోకి నీరు చేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోలియా లక్ష్మీనారాయణ సింగ్, చిగురు బాలరాజ్ ముదిరాజ్, గోలియా తారా సింగ్, పరమల మల్లేష్ యాదవ్, కుమ్మరి చంద్రయ్య, మంగళవారం కృష్ణ యాదవ్, ఎరుకలి వెంకటేష్, మందుమూల లక్ష్మారెడ్డి, మేకల నరేందర్ రెడ్డి, బుడాల దర్శన్ ముదిరాజ్, బుసతి శ్రీశైలం, మంగళవారం మాణిక్యం యాదవ్, గడిల నర్సింగ్, అల్లం కృష్ణ యాదవ్, గొరింకల నరసింహ ముదిరాజ్, కొండే కృష్ణ యాదవ్, గొల్ల సుధాకర్ యాదవ్, మంగలి యాదగిరి, కొండే సాయికిరణ్ యాదవ్, మంగళవారం శ్రీకాంత్ యాదవ్, బాపన్ సాయి తివారి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

### ఎమ్మెల్యే సహకారంతో ఎల్ఓసి అందజేసిన – సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు నెర్లకంటి నాగరాజు అనారోగ్యంతో బాధపడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో 2,50,000 వేల ఎల్ఓసి ని సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, మాజీ ఎంపీపీ గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మందుగుల బాలకృష్ణ, వార్డు సభ్యులు బల్గూరి శివ, సింగం బిక్షపతి, సూరపల్లి వెంకటేష్, కట్ల వనజ భాస్కరాచారి, చిలువేరు రమాదేవి శంకర్, పట్నం బాలకృష్ణ గౌడ్, నీళ్ల అనిత శంకర్, చింతల శైలజ సత్యనారాయణ, సింగపంగా ప్రశాంతి రమేష్, మహమ్మద్ అలీమా యూసఫ్ ఖాన్, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి కొండ నవీన్ గౌడ్,బానోతు కిరణ్ నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో జోరుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### కార్డుల కోసం బారులు తీరిన వందలాది మంది లబ్ధిదారులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. తమకు మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకునేందుకు వందలాది మంది లబ్ధిదారులు కేంద్రాల వద్ద బారులు తీరారు. అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లబ్ధిదారులను క్రమపద్ధతిలో పంపించి, వారికి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నారు. ముఖ్యంగా మహిళా లబ్ధిదారులకు అధికారులు వెన్నువెంటనే కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు విజయబాబు, లక్ష్మి, మౌనికతో పాటు రేషన్ షాప్ డీలర్లు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నారు. కార్డుల పంపిణీ ప్రక్రియను అధికారులు పర్యవేక్షిస్తూ, లబ్ధిదారులకు అవసరమైన సమాచారం అందిస్తున్నారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.